



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 17, పేజీలు - 08

శనివారం, జూన్ 21, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





## కొండా కాంట్రవర్సీ



**- కొండా కుటుంబం కుదురుగా ఉండదా?**

**- మళ్లీ ట్రబుల్ లో పడినట్లేనా?**

**- ముందే టిక్కెట్లు ప్రకటించుకున్నారా?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వరంగల్ కు చెందిన కొండా మురళి ఫ్యామిలీ ఎక్కడ ఉన్నప్పటికీ కాంట్రవర్సీకి కేరాఫ్ గా ఉంది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉంటూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. టాలీవుడ్ హీరోల కుటుంబం పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నాడు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అదే సమయంలో తర్వాత మంత్రులుగా ఉన్న వాళ్లు లంచాలు తీసుకోనిదే ఏ పనిచేయరని చేసిన వ్యాఖ్యలు కూడా సొంత పార్టీలో నేతలకు కన్నెర్రకు కారణమయ్యాయి. ఇక తాజాగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. సొంత పార్టీ నేతలనే కొండా మురళి లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు.

### పార్టీ మారిన నేతలపై..

కొండా మురళి వరంగల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సిగ్గుంటే పార్టీ మారినప్పుడు పదవులుకు రాజీనామాలు చేయాలని చేసిన వ్యాఖ్యలు సూటిగా తగిలిన నేతలు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘకాలంగా మంత్రిగా పనిచేశానని చెప్పుకునే నేతలు వారు గతంలో పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారన్నారు. నాడు తెలుగుదేశం లో చంద్రబాబు నాయుడిని, తర్వాత బీఆర్ఎస్ లో కేసీఆర్ ఓటమికి కారణమయ్యారని కొండా మురళి కడియం శ్రీహరిని ఉద్దేశించి అన్నారని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దీనిని కూడా ఆగం చేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు కడియం శ్రీహరితో పాటు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కొండా మురళి వ్యాఖ్యలకు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యం సన్నిహితులే.

### మూడు టిక్కెట్లు తమకు అంటూ..

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి కూడా కొండా మురళి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసిలోడు పరకాలకు వచ్చాడని, దరిద్రమైన నాయకుడని, నా రెండు కాళ్లు పట్టుకుని గెలిపించమని అడిగితే తాను సాయం చేశానని కొండా మురళి అన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుస్మిత ఎమ్మెల్యేగా

2లో..

## అవకాశాల మాతృభాష ఇంగ్లీష్

**- అమిత్ షా పై రాహుల్ ఫైర్**

- ఆంగ్ల భాష నేర్చుకోవడం అవమానకరం కాదన్న రాహుల్ గాంధీ
- ప్రపంచంతో పోటీ పడాలంటే ఆంగ్లం తప్పనిసరి అని స్పష్టీకరణ
- విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని వెల్లడి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన ఇంగ్లీష్ కామెంట్స్‌పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగ్గుమన్నారు. భాష అనేది ఎక్కడా అడ్డు కాదని అది ఒక వారధి మాత్రమే అని అభిప్రాయపడ్డారు. మాతృభాషతో సమానంగా ఇంగ్లీషు భాషపై కూడా పట్టు సాధించాలని అన్నారు. ఇప్పటి చిన్నారులు ఇంగ్లీషు భాష నేర్చుకోవడం బీజేపీ ఆర్ఎస్ఎస్ నాయకులకు ఇష్టం లేదని, ఒకవేళ నేర్చుకుంటే వారికి ఇబ్బందికరంగా

2లో..



## ఇజ్రాయెల్ దెబ్బకు ఇరాన్‌లో సంక్షోభం

**- అదే జరిగితే పాకిస్థాన్‌కూ ముప్పు**

2లో..



## భారత్‌లో ఇక అన్ని బైక్‌లకు ఏబీఎస్

**- కేంద్రం కీలక నిర్ణయం**

2లో..



## భారత్ మా ఎయిర్‌బేస్‌పై దాడి చేసింది

**- ఒప్పుకున్న పాకిస్థాన్ ఉప ప్రధాని**

2లో..



## వారికి నీళ్లు ఇచ్చేది లేదు

**- తేల్చిచెప్పిన ఒమర్ అబ్దుల్లా**

2లో..

## యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం

- 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, రాష్ట్రవ్యాప్త వేడుకలకు పిలుపు
- విశాఖ ఆర్కే బీచ్‌లో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు హాజరు
- యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి దూరమవుతుందన్న చంద్రబాబు
- వాడవాడలా యోగా సాధనతో చరిత్ర సృష్టిద్దామని పిలుపు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో నేడు జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా యోగా సాధనలో సరికొత్త రికార్డు సృష్టించాలని

2లో..

## ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

**- నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా పర్యటనకు రావాలంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని, ఒడిశా పర్యటనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒడిశాలో పర్యటించిన ఆయన, జగన్నాథుని

2లో..

## యోగాతో గిరిజన విద్యార్థులు చరిత్ర సృష్టించారు

- విశాఖలో విద్యార్థుల అపూర్వ యోగా ఘట్టం
- 25 వేల మంది సూర్య నమస్కారాలతో ప్రపంచ రికార్డు
- గిరిజన విద్యార్థుల ప్రతిభను కొనియాడిన మంత్రి నారా లోకేశ్
- ప్రధాని మోదీకి కానుకగా గిన్నిస్ రికార్డును అందిస్తామని వెల్లడి

**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** మనమంతా గర్వపడాల్సిన రోజని, యావత్ దేశంతో పాటు ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూసిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 25 వేల

2లో..



### ఫోన్ ట్యాపింగ్ సర్వైలెన్స్‌లోకి బండి సంజయ్

2లో..



## చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

**- కానీ ఆ హక్కులు వదులుకునే ప్రసక్తి లేదన్న సీఎం**

- పీఎఫ్ఆర్ ఇచ్చే ముందు తెలంగాణను సంప్రదించకపోవడమే వివాదానికి కారణమని వెల్లడి
- ఈ నెల 23న కేబినెట్ సమావేశం అనంతరం ఏపీని చర్చలకు ఆహ్వానిస్తామన్న సీఎం
- రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి,

3లో..



## హైదరాబాద్ మార్కెట్‌పై కన్నేసిన సింగరేణి

**- చిన్నపరిశ్రమలే టార్గెట్‌గా సరికొత్త వ్యూహం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో చిన్న పరిశ్రమలే టార్గెట్ గా సింగరేణి యాజమాన్యం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సింగరేణిలో ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. తెలంణలోని ధర్మల్ విద్యుత్ కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు సింగరేణి నుంచి ఏటా బొగ్గు సరఫరా జరుగుతోంది. హైదరాబాద్ మహానగరంగా విస్తరించి, అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నతరుణంలో, నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో

3లో..

## అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే

- మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందన
- సినిమా డైలాగులు నిజ జీవితంలో కుదరవని హితవు
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- రౌడీ షీట్లు తెరిచి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అణచివేస్తామన్న పవన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించేవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత

3లో..

## పోలవరంపై కవిత సంచలన వ్యాఖ్యలు

**- న్యాయపోరాటం చేస్తామని వెల్లడి**

- పోలవరం ప్రాజెక్టు నిర్వహణను ఉమ్మడి ఏపీలోనే వ్యతిరేకించామన్న కవిత
- తెలంగాణకు చెందిన 7 మండలాలను ఏపీకి అన్యాయంగా అప్పగించారని ఆరోపణ
- పోలవరం సామర్థ్యం పెంచడంతో ముంపు పెరుగుతోందని ఆందోళన
- ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్
- జూన్ 25న ప్రధాని సమావేశంలో ఈ విషయం ప్రకటించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ చాలా సమస్యలు ఎదుర్కొంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఈ అంశంపై నిర్వహించిన తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు

3లో..

## నాయిని, కడియం శ్రీహరిపై కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు

- భద్రకాళి ఆలయం ఎవరి జాగీరూ కాదన్న మంత్రి
- కడియం శ్రీహరి తన పదవికి ఎసరు పెడుతున్నారని సురేఖ ఆరోపణ
- గోదావరి పుష్కరాలకు కేంద్రం రూ.200 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి
- కేంద్ర మంత్రులు చొరవ చూపకపోతే చరిత్రహీనులవుతారని సురేఖ వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం విలేకరులతో జరిపిన సమావేశంలో ఆమె పలు అంశాలపై ఘాటుగా స్పందించారు. భద్రకాళి ఆలయ వివాదం నుంచి మొదలుకొని,

3లో..

# ఇజ్రాయెల్ దెబ్బకు ఇరాన్‌లో సంక్షోభం

## - అదే జరిగితే పాకిస్థాన్‌కూ ముప్పు

**ఇజ్రాయెల్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్ ప్రస్తుతం పలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకవైపు ఇజ్రాయెల్ నుంచి క్షిపణుల దాడులు, మరోవైపు అమెరికా నుంచి పొంచి ఉన్న ముప్పు ఆందోళన కలిగిస్తుండగా, దేశంలోని వేర్పాటువాద శక్తులు కూడా బలపడుతున్నాయి. ఇరాన్ బలహీనపడుతోందన్న సంకేతాల నేపథ్యంలో, ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ఇరాన్, పాకిస్థాన్‌లలోని మిలిటెంట్ గ్రూపులు ప్రయత్నిస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఇరాన్‌లోని పరిణామాలు కేవలం ఆ దేశానికే పరిమితం కాకుండా, పొరుగున ఉన్న పాకిస్థాన్‌కు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ బలహీనపడితే, ఆ ప్రభావం తమ దేశంపై తీవ్రంగా ఉంటుందని పాకిస్థాన్ ఆందోళన చెందుతోంది. ముఖ్యంగా, ఇరాన్‌లో సుప్రీం లీడర్ ఖమేనీ ప్రభుత్వం కూలిపోతే బలూచిస్థాన్ ఉద్యమం మరింత ఉధ్ధృతమవుతుందని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ అంశాన్ని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌తో పాటు, ఇరాన్ సరిహద్దుల్లోని సిస్థాన్, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోనూ బలూచ్ ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వం వీరిపై అణచివేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపణలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు ప్రాంతాల్లోని బలూచ్ ప్రజలు ఏకమై, ప్రత్యేక బలోచిస్థాన్ కోసం తమ పోరాటాన్ని తీవ్రతరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఇప్పటికే పాకిస్థాన్ సైన్యంపై దాడులను పెంచింది. గతంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్ ఘటనలో కూడా ఈ సంస్థ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

### జైష్ ఆల్ అదిల్

ఇరాన్, పాకిస్థాన్ దేశాలకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న 'జైష్ అల్ అదిల్' అనే మిలిటెంట్ సంస్థ మరో తలనొప్పిగా మారింది. ఇది ఇరాన్‌కు చెందిన వేర్పాటువాద సంస్థ అయినప్పటికీ, ఇందులో అధికశాతం బలూచ్ సభ్యులు ఉండటంతో దీని కార్యకలాపాలు పాకిస్థాన్‌ను కూడా కలవరపెడుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తమకు అనుకూలమైన అవకాశమని జైష్ అల్ అదిల్ ఇప్పటికే ప్రకటించింది. "ఇరాన్ ప్రజలందరి పట్ల జైష్ అల్ అదిల్ సోదరభావాన్ని ప్రకటిస్తోంది. ముఖ్యంగా బలూచిస్థాన్ ప్రజలు సాయుధ దళాలపై పోరాటానికి సిద్ధం కావాలి" అని ఆ సంస్థ ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. బలూచ్ ప్రజలు పాకిస్థాన్ జనాభాలో సుమారు 3.6 శాతం, ఇరాన్, అఫ్ఘానిస్థాన్ జనాభాలో దాదాపు 2 శాతం వరకు ఉన్నారు. ఈ వర్గాలు ఏకమైతే పరిస్థితి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బాహ్య బెదిరింపులతో పాటు, ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రభుత్వానికి దేశంలోని మైనారిటీ వర్గాల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. షియా ఆధిపత్యం గల ఇరాన్‌లో బలూచ్, కుర్దు వంటి మైనారిటీ వర్గాలు (ఎక్కువగా సున్నీలు) ఖమేనీ ప్రభుత్వ పాలనలో అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ జనాభాలో దాదాపు 15 శాతంగా ఉన్న కుర్దులు (సుమారు 10 నుంచి 12 మిలియన్ల మంది) ఖమేనీ ప్రభుత్వం పతనమైతేనే తమ పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తూ, ఆ దిశగా ప్రజలను సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

# భారత్‌లో ఇక అన్ని బైక్‌లకు ఏబీఎస్

## - కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో ద్విచక్ర వాహన ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టనుంది. ఇందులో భాగంగా, అన్ని రకాల టూవీలర్లకు యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) ను తప్పనిసరి చేయాలని యోచిస్తోంది. ఈ నూతన విధానం 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించనుంది. ప్రస్తుతం 150సీసీ పైబడిన ఇంజిన్ సామర్థ్యం గల బైక్‌లకు మాత్రమే ఏబీఎస్ నిబంధన వర్తిస్తోంది. అయితే, రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో, ఎంట్రీ లెవల్ మోడళ్లతో సహా అన్ని ద్విచక్ర వాహనాలకు దీనిని విస్తరించాలని కేంద్రం భావిస్తోంది. దేశంలో అధికశాతం అమ్ముడయ్యేది ఎంట్రీ లెవల్ బైక్‌లే కావడం, 2022 గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 20 శాతం ద్విచక్ర వాహనాల వల్ల జరిగినవే కావడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ మార్పుతో, ముఖ్యంగా తక్కువ శ్రేణి బైక్‌ల ధరలు సుమారు రూ. 2,500 నుంచి రూ. 5,000 వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏబీఎస్ వ్యవస్థ అదనపు ఖర్చుతో కూడుకున్నప్పటికీ, ప్రయాణికుల భద్రత గణనీయంగా మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అత్యవసర సమయాల్లో సడన్‌గా బ్రేక్ వేసినప్పుడు చక్రాలు లాక్ అవ్వకుండా, వాహనం అదుపు తప్పకుండా నిరోధించడమే ఏబీఎస్ ముఖ్య విధి. తద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించడానికి లేదా పూర్తిగా నివారించడానికి ఆస్కారం ఉంటుంది.

# భారత్ మా ఎయిర్‌బేస్‌పై దాడి చేసింది

## ఒప్పుకున్న పాకిస్థాన్ ఉప ప్రధాని

ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్) గత నెలలో భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడానికి తామే చొరవ చూపాల్సి వచ్చిందని పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా రావల్పిండి, పంజాబ్ ప్రావిన్స్‌లోని తమ రెండు కీలక వైమానిక స్థావరాలపై దాడులు జరిగాయని ఆయన అంగీకరించారు. ఈ దాడుల తీవ్రతతోనే అమెరికా, సౌదీ అరేబియా జోక్యం కోరి కాల్పుల విరమణకు సిద్ధపడ్డామని ఒక టీవీ న్యూస్ షోలో దార్ బహిరంగంగా వెల్లడించారు. పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ, "దురదృష్టవశాత్తూ, తెల్లవారుజామున 2:30 గంటలకు భారత్ మరోసారి క్షిపణి దాడులు చేసింది. రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్, పంజాబ్ ప్రావిన్స్‌లోని షోర్‌కోట్ ఎయిర్‌బేస్ (పీఏఎఫ్ బేస్ రఫీకిగా ప్రసిద్ధి) లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ ఘటన జరిగిన 45 నిమిషాల్లోనే సౌదీ యువరాజు ఫైసల్ నాకు ఫోన్ చేశారు. అప్పటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో నేను జరిపిన సంభాషణ గురించి ఆయనకు తెలిసిందని చెప్పారు. భారత్ దాడులు ఆపితే, పాక్ కూడా ఆపడానికి సిద్ధంగా ఉందని భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు తెలియజేయడానికి తనకు అధికారం ఉందా అని అడిగారు. నేను సరే సోదరా, మీరు మాట్లాడవచ్చు అని చెప్పాను. ఆ తర్వాత ఆయన మళ్లీ ఫోన్ చేసి, జైశంకర్‌కు ఈ విషయం తెలియజేశానని చెప్పారు" అని వివరించారు. నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ పాకిస్థాన్ అత్యంత కీలకమైన సైనిక స్థావరాల్లో ఒకటి. ఇక్కడ వాయుసేన కార్యకలాపాలతో పాటు వీఐపీ రవాణా యూనిట్లు కూడా ఉన్నాయి. ఇది రావల్పిండి, ఇస్లామాబాద్ నగరాల మధ్య ఉంది. రావల్పిండి పాక్ సైనిక ప్రధాన కార్యాలయం కాగా, ఇస్లామాబాద్ రాజకీయ అధికార కేంద్రం. ఇక పీఏఎఫ్ బేస్ రఫీకి పాకిస్థాన్ ప్రధాన ఫైటర్ ఎయిర్‌బేస్‌లలో ఒకటిగా పనిచేస్తుంది. ఇక్కడ చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లు, ఫ్రెంచ్ నిర్మిత మిరాజ్ 5 ఫైటర్లు, అలౌట్ %×××% హెలికాప్టర్లు వంటి అనేక యుద్ధ విమానాలు ఉన్నాయి.

# వారికి నీళ్లు ఇచ్చేది లేదు

**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** జమ్ము కశ్మీర్‌లోని అదనపు జలాలను ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పంజాబ్‌కు మళ్లించే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా వ్యతిరేకించారు. గతంలో తమ రాష్ట్రం నీటి అవసరాలతో ఇబ్బంది పడుతున్న సమయంలో పంజాబ్ ఏమాత్రం సహకరించలేదని, ఇప్పుడు తాము నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. జమ్ములో ప్రతిపాదించిన 113 కిలోమీటర్ల కాలువ ద్వారా నీటిని తరలించే అంశంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ నీటి తరలింపు ప్రతిపాదనను నేను ఎంతమాత్రం అంగీకరించను. ముందుగా మా రాష్ట్ర అవసరాలకు నీటిని పూర్తిగా వినియోగించుకుంటాం. జమ్ము ప్రాంతంలోనే తీవ్ర నీటి ఎద్దడి, కరవు పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటప్పుడు పంజాబ్‌కు నీటిని ఎందుకు తరలించాలి?" అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. సింధూ జలాల ఒప్పందం ప్రకారం పంజాబ్‌కు ఇప్పటికే తగినన్ని నీళ్లు అందుతున్నాయని ఆయన గుర్తుచేశారు. "అవసరమైనప్పుడు వారు మాకు నీళ్లందించారా? సంవత్సరాల తరబడి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారు. మరి మేమెందుకు వారికి నీళ్లు ఇవ్వాలి?" అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. రావి నది జలాలు పాకిస్థాన్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు పఠాన్‌కోట్ వద్ద బ్యారేజీ నిర్మించాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. ఈ బ్యారేజీ నిర్మాణం విషయమై పంజాబ్, జమ్ము కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దశాబ్దాలుగా వివాదం కొనసాగింది. 1979లో దీనికి సంబంధించి ఇరు రాష్ట్రాల మధ్య ఒక ఒప్పందం కుదిరినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. చివరకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని 2018లో ఈ వివాదానికి ముగింపు పలికింది. అయితే, ఆ పాత విషయాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఇప్పుడు పంజాబ్‌కు నీటిని విడుదల చేసే విషయంలో ఒమర్ అబ్దుల్లా కఠినంగా వ్యవహరిస్తున్నారు.

### కేంద్రం యోచన

సింధూ జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు వెళుతున్న నీటిని పంజాబ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాలకు మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ దిశగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తమ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, మిగులు జలాలు ఉంటేనే ఇతర రాష్ట్రాలకు ఇచ్చే విషయం ఆలోచిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కొండా కాంట్రవర్సీ

గెలవడం ఖాయమని, తాను కూడా ఎమ్మెల్సీ అవుతానని, కొండా సురేఖ కూడా వరంగల్ తూర్పు నుంచి పోటీ చేస్తారని కొండా మురళి తనకు తానే టిక్కెట్లను డిక్లేర్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీంతో ఈరోజు కొండా మురళి తమపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కడియం శ్రీహరి, నాయని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశమై హైకమాండ్ కు ఫిర్యాదు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద మరోసారి కొండా కుటుంబం ట్రబుల్ లో పడిందనే చెప్పాలి.

### కొండా మురళి వ్యాఖ్యలపై స్పందించిన టీపీసీసీ చీఫ్

వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరినట్లు ఆయన తెలిపారు. డీసీసీ, పరిశీలకుడి నివేదిక అందిన తర్వాత స్పందిస్తానని పేర్కొన్నారు. కొండా మురళి వ్యాఖ్యలపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఆ ఫిర్యాదులను పరిశీలిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా టీపీసీసీ చీఫ్ స్పందించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మాట్లాడటం సరికాదని సూచించానని అన్నారు. కార్యకర్తల ఉత్సాహం కోసమే అలా మాట్లాడినట్లు వివరణ ఇచ్చారని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ఆయన అన్నారు.

# అవకాశాల మాతృభాష ఇంగ్లీష్

మారుతుందనే ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. చిన్న పిల్లలు ఇంగ్లీషు భాష నేర్చుకుంటే బీజేపీ ఆర్ఎస్ఎస్ నేతలను ప్రశ్నిస్తారు కాబట్టే అమిత్ షా లాంటి నేతలు ఇంగ్లీషు భాషపై తమ పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. దేశంలోని ప్రతి భాషకు ఒక ఆత్మ, సంస్కృతి, విజ్ఞానం ఉందని పేర్కొన్న రాహుల్ ఫలానా భాష మాట్లాడుతున్నందుకు గర్వపడాలని చెప్పారు. ప్రతి ఒక్క చిన్నారికి ఇంగ్లీషు భాషపై పట్టు రావాలని ఆకాంక్షించిన కాంగ్రెస్ అధినేత ఇంగ్లీషు పై పట్టు ఉంటేనే నేటి పోటీ ప్రపంచంలో నెట్టుకురాగలమని ముఖ్యంగా భారత్ ఇతర ప్రపంచ దేశాలతో పోటీపడగలదని నొక్కి చెప్పారు. మాతృభాష ఎంత ముఖ్యమో ఈరోజు ఇంగ్లీషు నేర్చకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇంగ్లీషు నేర్చుకోవడం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని చెప్పిన రాహుల్ గాంధీ అదే సమయంలో ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందిస్తుందని అందుకే ఎవరేమి మాట్లాడిన ఇంగ్లీషు నేర్చుకోవాలని చిన్నారులకు పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తమ పిల్లలను ఇంగ్లాండ్, అమెరికాలాంటి దేశాలకు పంపుతున్నారని చెప్పిన రాహుల్ గాంధీ ఇంగ్లీష్ భాష ఒక ఆయుధంలా పనిచేస్తుందని అన్నారు. ఇంగ్లీషు నేర్చుకుంటే విదేశాల్లో ఉద్యోగాలు పొందొచ్చని చెప్పారు. ఇంగ్లీషు నేర్చుకోవద్దని చెప్తున్నారంటే దానివెనకున్న కుట్ర ఏంటో ఆలోచించాలని అన్నారు. ఇంగ్లీషు నేర్చుకుని మంచి ఉద్యోగం సంపాదించి కోట్ల జీతం తీసుకోవడం బీజేపీ ఆర్ఎస్ఎస్ వారికి ఏమాత్రం ఇష్టం లేదని రాహుల్ గాంధీ వివరించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన పిల్లలు ఎస్సీ స్కూళ్లకు వెళ్లాలని అక్కడ ఇంగ్లీషు ఉండదని అదే బీజేపీ కోరుకుంటోందని అన్నారు. దళితులకు ఉన్న అవకాశాల ద్వారాలు మూసివేయాలన్నదే బీజేపీ ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఉందని చెప్పిన రాహుల్ గాంధీ ఇంగ్లీషు అనే ఆయుధం మన వద్ద ఉంటే ప్రపంచాన్ని జయించొచ్చని పిలుపునిచ్చారు.

# యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం

ఆయన ఆకాంక్షించారు. యోగా మన ప్రాచీన సంస్కృతిలో భాగమని, అది మనకు లభించిన అమూల్యమైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శారీరక, మానసిక ఒత్తిళ్లను తగ్గించడంలో యోగా పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. "యోగాను నిత్యం ఆచరిద్దాం. మన జీవన విధానంలో అంతర్భాగంగా మార్చుకుందాం. విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నుంచే దీనికి నాంది పలుకుదాం" అని ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి అన్నారు. యోగా సాధన ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. "ప్రధాని నరేంద్ర మోదీ గారి సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్ లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. అలాగే రాష్ట్రంలో వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం" అని ఆయన దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వారసత్వంగా మనకు అందిన ఈ యోగా విద్యను మనమంతా ఆచరించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

### సాగర తీరం వెంబడి అపూర్వ ఘట్టం

ఈ మెగా ఈవెంట్ కోసం విశాఖ ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు సుమారు 34 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని యోగా వేదికగా తీర్చిదిద్దారు. బీచ్ రోడ్డులో మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ప్రతి 40 అడుగులకు ఒక చిన్న వేదికను నిర్మించారు. ఈ ఏర్పాట్ల దృష్ట్యా, శుక్రవారం (జూన్ 20) నుంచే బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి ముందుగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు. ప్రతిఒక్కరికీ ఉచితంగా యోగా మ్యాట్, టీ షర్టులు అందజేస్తారు.

### రూ.62 కోట్లతో విస్తృత ఏర్పాట్లు

సుమారు 62 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాల్గొనేవారి సౌకర్యార్థం 3 వేల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఐదు కంపార్ట్‌మెంట్‌లకు ఒక వైద్య శిబిరాన్ని, ప్రధాన వేదిక వద్ద పది పడకల తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేశారు. ప్రజల తరలింపు కోసం 3,600 ఆర్టీసీ బస్సులతో పాటు 7,295 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు.

### వర్షం వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఒకవేళ శనివారం వర్షం కురిస్తే, కార్యక్రమానికి అంతరాయం కలగకుండా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మైదానంలో సుమారు 20 వేల మంది గిరిజన విద్యార్థులతో ప్రత్యేక యోగా కార్యక్రమం కూడా జరగనుంది. ఇక్కడ కూడా పది పడకల ఆసుపత్రిని నిర్మించారు.

### భద్రత, పర్యవేక్షణ

ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖలో కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, బీచ్ రోడ్డు వెంబడి 2 వేల సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమ పర్యవేక్షణకు 26 మంది ప్రముఖ యోగా గురువులు, 1,500 మంది శిక్షకులు, 6,300 మంది వాలంటీర్లు సేవలందించనున్నారు. తూర్పు నౌకాదళం కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటోంది. వారి ఆధ్వర్యంలో 11 యుద్ధ నౌకలపై యోగా సాధన చేయనున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్ కోసం ఐఎన్ఎస్ డేగ నుంచి కమాండ్ గెస్ట్ హౌస్ వరకు పోలీసులు ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గిన్నిస్ రికార్డు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, యోగా కార్యక్రమం కోసం బీచ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచామని ఆయన వివరించారు. ఈ అపూర్వ ఘట్టం ద్వారా యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

భూమికి రావడం తనకెంతో ముఖ్యమని పేర్కొన్నారు. అంతకుముందు బీహార్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మోదీ, మధ్యాహ్నం ఒడిశా చేరుకుని రోడ్ షో, బహిరంగ సభలో పాల్గొన్నారు. జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి, వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారని, విందులో పాల్గొని చర్చించుకుందామని చెప్పారని అన్నారు. "జగన్నాథుని క్షేత్రానికి వచ్చేందుకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని నేను వినమ్రంగా తిరస్కరించాను" అని మోదీ బహిరంగ సభలో వెల్లడించారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ తొలి ఏడాది పాలనను ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. "ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది. పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలను, రత్న భండార్‌ను తిరిగి తెరిపించింది" అని ఆయన అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ రూ.18,600 కోట్లకు పైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఒడిశా విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించడంతో పాటు, పలు కొత్త రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అంతేకాకుండా, 'లక్షపతి దీదీలు' సహా పలువురు లబ్ధిదారులను సత్కరించారు. తాగునీరు, నీటిపారుదల, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, గ్రామీణ రహదారులు, వంతెనలు, జాతీయ రహదారులు, రైల్వే మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. గతేడాది జూన్ ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని మోదీ రాష్ట్రానికి రావడం ఇది ఆరోసారి.

# యోగాతో గిరిజన విద్యార్థులు చరిత్ర సృష్టించారు

మంది విద్యార్థులు ఒకేసారి సూర్యనమస్కారాలు చేసి చరిత్ర సృష్టించారని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం జూన్ 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సృష్టించే దిశగా అడుగులు వేశారు. ఈ రోజు గిరిజన విద్యార్థులను చూస్తుంటే వారి కమిట్‌మెంట్, పట్టుదల స్పష్టంగా కనిపిస్తున్నాయని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కారాలు చేయడం అందరినీ ఆశ్చర్యపరిచిందని, ఒక్క పిలుపుతో వారంతా కష్టపడి దేశంతో పాటు ప్రపంచం మనవైపు చూసేలా చేసినందుకు ప్రభుత్వం తరపున విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రదర్శన ఒక ప్రపంచ రికార్డు అని, దీనిని శనివారం అధికారికంగా ప్రకటిస్తారని ఆయన వెల్లడించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులందరికీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్నడూ జరగని విధంగా నిర్వహించి చూపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీని కోరారని, అందుకు అనుగుణంగానే ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని లోకేశ్ గుర్తుచేశారు. నేడు జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో 5 లక్షల మంది పాల్గొని మరో గిన్నిస్ రికార్డు సృష్టించబోతున్నారని ఆయన ప్రకటించారు. యోగా అనేది కేవలం ఆసనాలు కాదని, అది మన జీవన విధానమని, మనందరికీ క్రమశిక్షణ నేర్పుతుందని మంత్రి లోకేశ్ అన్నారు. తాను కూడా విద్యార్థి దశలో ఉన్నప్పుడు తన తండ్రి చంద్రబాబు తనతో యోగా చేయించేవారని, ఉదయాన్నే నిద్రలేవడం మొదట్లో కష్టంగా అనిపించినా, ఆయన నేర్పించిన క్రమశిక్షణ, పట్టుదల వల్లే తాను ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నానని వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. అదే క్రమశిక్షణ, పట్టుదల ఈ విద్యార్థుల్లోనూ ఉందని, దానిని ఎప్పటికీ మరువొద్దని సూచించారు. ఆంధ్రులుగా మన కోరికలన్నీ ప్రధాని నరేంద్ర మోదీ తీరుస్తున్నారని మంత్రి లోకేశ్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపారని, విశాఖకు రైల్వే జోన్ ఇచ్చారని, నిలిచిపోయిన అమరావతి పనులను పునఃప్రారంభించారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అవసరమైన సంస్థలను కేటాయించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్నా, విశాఖ అన్నా ప్రధాని మోదీకి చాలా ప్రేమ అని, ఏడాదిలో రెండోసారి ఆయన విశాఖకు వస్తున్నారని గుర్తుచేశారు. ఆయనకు కానుకగా ఈ రోజు విద్యార్థులు సాధించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. ఈ విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల చూస్తుంటే తన కుమారుడు దేవాన్ష్ గుర్తుకువస్తున్నాడని, ఈ లక్షణాలను దేవాన్ష్‌కు కూడా నేర్పించాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్ సర్వైలెన్స్‌లోకి బండి సంజయ్

## - సాక్ష్యం చెప్పాలని బీజేపీ నేతకు పిలుపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరింత విస్తరిస్తోంది. ఇది ఒకరిద్దరికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలంతా ఈ సర్వైలెన్స్‌లోకి వచ్చేశారా అనే అనుమానం కలుగుతోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లు ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించారట. ఇప్పుడు ఆ దిశగా దర్యాప్తు టర్న్ అవుతున్నట్టు తెలుస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సంబంధించిన వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయాలేదా అనే విషయాన్ని గుర్తించేందుకు కరీంనగర్ బీజేపీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావును సిట్ అధికారులు పిలిచారు. గతంలో జరిగిన ఘటనలు వివరించాలని ఆదేశించారు. ఇప్పుడు ఆయన చెప్పే సాక్ష్యం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నారు. బండి సంజయ్‌కు ప్రవీణ్‌రావు చాలా సన్నిహితుడు. టెన్త్‌పేపర్ లీక్, బైంసా అల్లర్లు, ఇతర కార్యక్రమాల్లో బండి సంజయ్‌తోపాటు ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఎప్పుడూ వెన్నంటి ఉండే ప్రవీణ్‌రావు ఫోన్‌ను అప్పట్లో ట్యాప్ చేసినట్టు అధికారులు తేల్చారు. ఇప్పుడు వాటిపై నిగ్గు తేల్చే పనిలో ఉన్నారు. అందుకే ఆయనకు నోటీసులు పంపించి విచారణకు పిలుస్తున్నారు.

ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సిట్ ముందు హాజరై తమ ఫోన్‌లు ట్యాప్ అయినట్టు వాంగ్మూలం ఇస్తున్నారు. అందుకు సాక్ష్యాలను కూడా సిట్ అధికారులు అందజేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ హాజరై సిట్‌కు స్టేట్మెంట్ ఇచ్చారు. ఇప్పుడు చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ లీడర్లు సిట్ విచారణకు హాజరయ్యారు.

### సాక్షులుగా స్టేట్మెంట్‌లు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ నాయకుడు, తవక్కల్ విద్య సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్, మందమర్రి కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముజాహిద్ హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో చాలా ఇబ్బంది పడ్డట్టు చెప్పారు. బాల్క సుమన్ లాంటి వారు హింసించారని ఆరోపించారు. వివేక్‌కు మద్దతుగా ఉన్నందుకు ఫోన్‌లు ట్యాప్ చేసి బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. పోలీసులు, కీలక నేతలు భయపెట్టారని అన్నారు. తమ ఫోన్ ట్యాప్ అయిన సంగతి సిట్ అధికారులు చెప్పే వరకు తెలియదని తర్వాత నాటి సంగతులు గుర్తుకు వచ్చాయని అన్నారు. దాదాపు ఆరు నెలల పాటు తమను వెంటాడినట్టు చెప్పుకొచ్చారు.

### కేసీఆర్ సూచనలతోనే ఫోన్ ట్యాపింగ్: గోనె ప్రకాశ్ రావు

మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావును కూడా సిట్ అధికారులు పిలిచి విచారించారు. సాక్షిగా వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఉదయం 10.30కి ఆయన తన స్టేట్మెంట్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలోనే ఫోన్ ట్యాపింగ్ కుట్ర జరిగిందని ఆరోపించారు. అధికారులు కీలకమైన వ్యక్తుల ఫోన్‌లు ట్యాప్ చేసి సమాచారాన్ని కేసీఆర్, సంతోష్‌కు చేర్చేవారని అన్నారు. ఇలా చేయడం వల్లే ఓటుకు నోటుఅంశం వెలుగు చూసిందని తెలిపారు. కవిత, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు లాంటి వాళ్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని విమర్శించారు. రాజకీయ నాయకులతోపాటు సినిమా, బిజినెస్ వాళ్ల ఫోన్‌లు కూడా ట్యాపప్ చేశారని ఆరోపించారు.

# పోలవరంపై కవిత సంచలన వ్యాఖ్యలు

ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సీఎంలతో నిర్వహించే సమావేశంలో ప్రధాని మోదీ ఈ అంశాన్ని చర్చించాలన్నారు. ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అన్నారు. లేదంటే ఏ ఒక్క ఏడాదిలోనైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని కామెంట్ చేశారు కవిత. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి భూములు వెయ్యి ఎకరాలు ఉందన్నారు. వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయిందని, దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని తెలిపారు. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంతమవుతోందని ఆరోపించారు.

భద్రాచలం దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు.

2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను అన్యాయంగా ఆమోదించారన్నారు. అంతే కాకుండా లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీ అప్పజెప్పారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను, ఆ ప్రాజెక్టును లాక్కున్నారని అన్నారు.

ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తామంతా గళమెత్తామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యులందరం పార్లమెంటులో మాట్లాడామని కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరించారని విమర్శించారు కవిత. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా కాలేదని మండిపడ్డారు.

పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పాత్రను రేవంత్ నిరూపించగలడా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం ఒక ప్రధాన రాజకీయ వివాదంగా ఉద్భవించింది. గత భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం, కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో, రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, కాంట్రాక్టర్లు, పొలిటికల్ ఎనలిస్టులు, చివరకు జడ్జీలు, కుటుంబ సభ్యులపై అనధికారికంగా నిఘా పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో, ఈ ఆరోపణలను దర్యాప్తు చేస్తోంది. కేసులో ఏ1 నిందితుడు అయిన ప్రభాకర్ రావు ఏడాది తర్వాత ఇండియాకు వచ్చారు. ఆయన విచారణతో కేసు కొలిక్కి వస్తుందని అంతా భావించారు. కానీ, నాలుగుసార్లు విచారణకు వచ్చిన ప్రభాకర్రావు ఎవరి పేరు చెప్పడందు. దీంతో ఈ కేసులో కేసీఆర్ పాత్రను నిరూపించడం సాధ్యమవుతుందా? అన్న చర్చ జరుగుతోంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులపై అనధికారిక ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసు చాలా మంది నేతలకు ఆగ్రహాన్ని రేకెత్తించింది, ఎందుకంటే ఇది రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనలను సూచిస్తుంది. 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆరోపణలను దర్యాప్తు చేయడానికి ప్రాధాన్యత ఇచ్చింది. నిజనిజాలను వెలికితీసే ఈ ప్రక్రియ, ప్రభుత్వ బాధ్యతాయుతత్వాన్ని నిరూపించే కీలక పరీక్షగా పరిగణించబడుతోంది.

### - కేసీఆర్, బీఆర్ఎస్ పై ఆరోపణలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అనధికారిక ఫోన్ ట్యాపింగ్ను ఉపయోగించిందని ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ నిఘా కార్యకలాపాలలో కేసీఆర్ హయాంలో సీనియర్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారని దర్యాప్తు చేస్తోంది. ఈ ట్యాపింగ్ కేవలం రాజకీయ ప్రత్యర్థులకే పరిమితం కాకుండా, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, సినీ నటులు, చివరకు కవిత, వై.ఎస్. షర్మిల వంటి కీలక వ్యక్తుల కుటుంబ సభ్యులను కూడా లక్ష్యంగా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఇది రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య సూత్రాలకు తీవ్ర ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అయితే, కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వం ఈ ఆరోపణలను ఖండించారు. కొందరు దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు.

### - దర్యాప్తు పురోగతి, సవాళ్లు..

అధికారంలోకి వచ్చిన తర్వాత, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ( ఐఖీ) ఏర్పాటు చేసింది. కాల్ రికార్డులు, అడ్డగించిన సమాచారం, నిఘా కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారుల సాక్ష్యాల వంటి ఆధారాలను సేకరించడంపై ఈ బృందం దృష్టి సారించింది. పారదర్శకమైన, సమగ్రమైన దర్యాప్తుతో న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, కేసీఆర్ ప్రత్యక్ష పాత్రను నిరూపించడం సవాళ్లతో కూడుకున్నది. నిఘా కార్యకలాపాలను కేసీఆర్ లేదా సీనియర్ బీఆర్ఎస్ నాయకులతో స్పష్టంగా అనుసంధానించే ఆధారాల గొలుసును దర్యాప్తు బృందం స్థాపించాలి. అధికారిక ఆదేశాలు, సమాచారాలు లేదా కీలక ఆపరేటివ్ల నుంచి ఒప్పుకోలు వంటి ఆధారాలు అవసరం, ఇవి ఈ కార్యకలాపాల సున్నిత స్వభావం



కారణంగా పొందడం కష్టం.

### - చట్టపరమైన, సాంకేతిక సవాళ్లు

ఫోన్ ట్యాపింగ్ అనేది రహస్య కార్యకలాపం, తరచుగా ఉన్నతాధికారులను రక్షించేందుకు బహుళ దశలతో జరుగుతుంది. నిఘా సామగ్రి మూలాన్ని గుర్తించడం, ఎన్క్రిప్టెడ్ సమాచారాన్ని విశ్లేషించడం వంటి సాంకేతిక సవాళ్లను దర్యాప్తు బృందం ఎదుర్కోవాలి. అదనంగా, గోప్యతా చట్టాలు, విధానపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిన చట్టపరమైన సంక్లిష్టతలు దర్యాప్తును మందగించవచ్చు. చట్టవిరుద్ధంగా పొందిన ఆధారాలు కోర్టులో ఆమోదయోగ్యం కాకపోవచ్చు, ఇది కేసును మరింత క్లిష్టతరం చేస్తుంది.

### - కాంగ్రెస్ ప్రభుత్వానికి విశ్వసనీయత పరీక్ష

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు కేవలం సత్యాన్ని వెలికితీసే సమస్య కాదు, ఇది పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలనగా దాని విశ్వసనీయతను నిరూపించే అవకాశం. కేసీఆర్ పాత్రను విజయవంతంగా నిరూపిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను గౌరవించే పార్టీగా దాని ఇమేజ్ను బలపరుచుకోవచ్చు. ఆధారాలను సమర్పించడంలో విఫలమైతే, రాజకీయ ప్రతీకారం ఆరోపణలు ఎదురవుతాయి, ఇది ప్రభుత్వ స్థానాన్ని బలహీనపరుస్తుంది.

### - ఆధారాలు సేకరించగలరా?

దర్యాప్తు విజయం, కేసీఆర్ లేదా అతని సన్నిహిత సహాయకులను ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలతో అనుసంధానించే కచ్చితమైన ఆధారాలను సేకరించడంపై ఆధారపడి ఉంటుంది. విజిల్ బ్లోయర్ సాక్ష్యాలు, నిఘా సామగ్రి యొక్క ఫోరెన్సిక్ విశ్లేషణ లేదా లీక్ అయిన డాక్యుమెంట్లు కీలక పాత్ర పోషించవచ్చు. అయితే, కాలం గడిచిపోవడం, అధికార మార్పిడి సమయంలో ఆధారాలు నాశనం అయ్యే అవకాశం గణనీయమైన అడ్డంకులను సృష్టించవచ్చు.

### - న్యాయం జరుగుతుందా?

దర్యాప్తులో గణనీయమైన ఆధారాలు బయటపడితే, న్యాయం చేయడం తదుపరి సవాలుగా ఉంటుంది. హై-ప్రొఫైల్ రాజకీయ కేసులు తరచుగా సుదీర్ఘ వ్యాజ్యాలు, ప్రజా పరిశీలనను ఎదుర్కొంటాయి. దర్యాప్తు రాజకీయ ప్రభావం నుంచి స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండేలా ప్రభుత్వం నిర్ధారించాలి. ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. కేసీఆర్ పాత్రను నిరూపించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విజయం, చట్టపరమైన, సాంకేతిక, రాజకీయ సవాళ్లను అధిగమించడంపై ఆధారపడి ఉంటుంది. ఈ దర్యాప్తు న్యాయం, ప్రజాస్వామ్య సూత్రాలను సమర్థించే అవకాశాన్ని అందిస్తుంది, అయితే రాజకీయ ఉద్రిక్తతలను పెంచే ప్రమాదం కూడా ఉంది. దర్యాప్తు పురోగమిస్తున్న తరుణంలో, తెలంగాణ ప్రజలు ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుతత్వంపై ఇచ్చిన హామీని నెరవేరుస్తుందా అని ఆసక్తిగా గమనిస్తున్నారు.

# వ్యాయామ సాధన సమాహారాల ఆధ్యాత్మిక రూపమే "యోగా"



ప్రాచీన భారతీయ సంప్రదాయం యొక్క అమూల్యమైన బహుమతి యోగా, శారీరక, మానసిక శ్రేయస్సును పెంపొందించడానికి అత్యంత విశ్వసనీయ మార్గాలలో ఒకటిగా ఉద్భవించింది. "యోగ" అనే పదం సంస్కృత మూలం యుజ్ నుండి ఉద్భవించింది, దీని అర్థం చేరడం, కలిసి ఉండటం, లేదా ఏకించడం. ఇది మనస్సు, శరీరం యొక్క ఐక్యతను సూచిస్తుంది ఆలోచన, చర్య, నిగ్రహం, సంతృప్తి, మానవుడు, ప్రకృతి మధ్య సామరస్యం, ఆరోగ్యం, శ్రేయస్సుకు సమగ్ర బాంధవ్యాన్ని సూచిస్తుంది.జీవితంలోని అన్ని అంశాల మధ్య సమతుల్యతను సాధించడమే కాకుండా ఆరోగ్యం, శ్రేయస్సుకు యోగా ఒక సమగ్ర విధానాన్ని అందిస్తుంది. యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాల గురించి సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడం ప్రపంచ జనాభా ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉందని అని యూ.ఎన్.జీ.ఓ ఆమోదించింది. ఇది సమగ్ర ఆరోగ్య విప్లవ యుగానికి దారితీసింది, దీనిలో చికిత్స కంటే నివారణకు ఎక్కువ శ్రద్ధ ఇవ్వబడింది. శతాబ్దాల క్రితం, అత్యంత ప్రజాదరణ పొందిన సంస్కృత కవులలో ఒకరైన భర్తృహరి, యోగా యొక్క ప్రత్యేకతను గురించి వివరించారు. క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం ద్వారా, ఒక వ్యక్తి తండ్రిలా రక్షించే ధైర్యం, తల్లిలా క్షమ, శాశ్వత స్నేహితుడిగా మారే మానసిక ప్రశాంతత వంటి కొన్ని మంచి లక్షణాలను అలవర్చుకోవచ్చు. క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం ద్వారా సత్యం మన బిడ్డగా, దయ మన సోదరిగా, స్వీయ నియంత్రణ మన సోదరుడిగా మారుతుంది, భూమి మన మంచం అవుతుంది. జ్ఞానం మన ఆకలిని తీరుస్తుంది. యోగా అంటే వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపం. ఇది హిందూత్వ అధ్యాత్మిక సాధనలలో ఒక భాగం. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగవుతు అన్ని సమస్యలకు యోగా పరిష్కారం చూపుతుంది. యోగ మన దేశ ప్రాచీన సంపద. ఋషుల కాలం నుంచి యోగా ఉంది. శరీరం, మనస్సు, ఆత్మను సమ్మిళితం చేస్తుంది. యోగాకు మతం లేదు. సర్వ ధర్మాలకు చెందిన ఒక ఆరోగ్య శాస్త్రం యోగా. కాగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.ఈ సంవత్సరం ప్రపంచం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోబోతోంది. యోగా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజున సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు యోగా కార్యక్రమాల్లో పాల్గొనటం విశేషం

### అంతర్జాతీయ యోగా దినోత్సవం

దేశంలో తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2015 సంవత్సరంలో జరుపుకున్నారు. దీనిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సెప్టెంబర్ 27, 2014న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో తన ప్రసంగంలో యోగా అంశాన్ని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను డిసెంబర్ 11, 2014న ఆమోదించి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించారు. సంవత్సరంలో మొత్తంలో జూన్ 21 న అత్యధిక పగటి సమయం ఉండే రోజు. కావున ఈ రోజను అంతర్జాతీయ యోగా డే గా జరుపుకోవాలని నిర్ణయించడం విశేషం.

### అంతర్జాతీయ యోగా దినోత్సవం నినాదం

ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఒక కొత్త నినాదం జరుపుకుంటారు. దానిలో భాగమే ఈ సంవత్సరం "యోగా ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్ అనే నినాధంతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.



రవికుమార్ సంతోజు బడంగ్ పేట్

# అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే

జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కల్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు."పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది" అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. "ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు" అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. "నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు."విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ మార్కెట్పై కన్నేసిన సింగరేణి

చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమల నిర్వహణకు అవసరమైన బొగ్గు కోసం ఇన్నాళ్లు రామగుండం లేదా కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోంది. తక్కువ మొత్తంలో బొగ్గు అవసరమైనప్పటికీ , దూరప్రాంతం నుంచి సరఫరా చేసుకోవడంతో రవాణా ఖర్చులు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రభావం బొగ్గు విక్రయాలపై పడటంతో ఆశించిన స్థాయిలో సింగరేణిలో బొగ్గు విక్రయాలు జరగడంలేదు. దీనిపై దృష్టి సారించిన సింగరేణి యాజమాన్యం హైదరాబాద్ బహిరంగ మార్కెట్ పై కన్నేసింది. బొగ్గు ఎగుమతులు భారీగా పెంచేందుకు భాగ్యనగరాన్ని టార్గెట్ చేసింది. అతి త్వరలో హైదరాబాద్లో సింగరేణి బొగ్గు విక్రయ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా బొగ్గు అవసరాలకు ఇకపై హైదరాబాద్ చుట్టుప్రక్కల పరిశ్రమల నిర్వాహకులు రామగుండం, కొత్తగూడెం వెళ్లాల్సిన పనిలేదు. రవాణాఖర్చుల భారం భారీగా తగ్గుతాయి. హైదరాబాద్ విక్రయ కేంద్రంలోనే బొగ్గు అందుబాటులోకి రావడంతో విక్రయాలు ఊహించని స్థాయిలో పెరుగుతాయి. ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా బొగ్గు తరలించేదుకు టన్నుకు 1600 రూపాయలు ఖర్చవుతుంది. రైలు మార్గం ద్వారా తరలించేందుకు టన్నును 500 రూపాయలు అవుతుంది.భారీ మొత్తంలో బొగ్గును హైదరాబాద్ విక్రయ కేంద్రానికి తరలించి, అక్కడ నుంచి నేరుగా అమ్మకాలు జరపడం ద్వారా డిమాండ్ పెరగడంతోపాటు సరఫరా సులభతరం అవుతుంది. హైదరాబాద్ చుట్టు ప్రక్కల పరిశ్రమలతోపాటు సమీపంలోని జిల్లాల నుంచి హైదరాబాద్కు రవాణా సదుపాయం ఎనీటైమ్ అందుబాటులో ఉంటుంది కాబట్టి విక్రయాలు ఊహించని ఊపందుకుంటాయి. ఇలా సింగరేణి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనట్లుగా బహిరంగా మార్కెట్లో సింగరేణి బొగ్గు విక్రయాలు ప్రారంభించడం ద్వారా సింగరేణి సంస్థకు లాభాల పంట ఖాయమని యాజమాన్యం భావిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన వ్యాపారం ద్వారా వచ్చే లాభాల వల్ల సింగరేణి కార్మికులకు మేలు జరుగుతుందని, ఆర్థికంగా కార్మికులు బలోపేతం అయ్యేందుకు ఇది మంచి అవకాశం కావడంతో కార్మికుల నుంచి సైతం హర్షం వ్యక్తమవుతోంది.హైదరాబాద్ కేంద్రంగా బహిరంగ మార్కెట్లో బొగ్గు విక్రయం నిర్ణయం సరైనదే అయినప్పటికీ నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని భావించింది సింగరేణి యాజమాన్యం. ఈ నేపథ్యంలో నాణ్యత తక్కువగా ఉండే జీ 14, జీ 15 బొగ్గు సరఫరా నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు. క్వాలిటీ బొగ్గు జీ 13ను మాత్రమే బహిరంగ మార్కెట్ లోకి సరఫరా చేయాలని భావించారు. ఇలా టార్గెట్ హైదరాబాద్ ద్వారా ఊహించని స్థాయిలో బొగ్గు విక్రయాలు పెరుగుతాయని సింగరేణి సంస్థ పూర్తి నమ్మకంతో ఉంది. సాధ్యమైనంత వేగంగా తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు, బొగ్గు అమ్మకాలను ప్రారంభించడం ద్వారా బహిరంగ మార్కెట్ సింగరేణి సత్తా చాటేందుకు సిద్దమవుతోంది.

# నాయిని, కడియం శ్రీహరిపై కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు

తన మంత్రి పదవిని లక్ష్యంగా చేసుకుని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అదే సమయంలో గోదావరి పుష్కరాల నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై, తెలంగాణ కేంద్ర మంత్రులపైనా ఆమె విమర్శలు గుప్పించారు.

### - భద్రకాళి ఆలయం ఎవరి సొత్తు కాదు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీరుపై కొండా సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "భద్రకాళి ఆలయం ఎవరి సొంత ఆస్తి కాదు. కానీ కొందరు అది తమదే అన్నట్లుగా భావిస్తున్నారు" అంటూ నాయినిని ఉద్దేశించి విమర్శించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు నాయిని రాజేందర్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆమె ఆరోపించారు. భద్రకాళి అమ్మవారికి ఆగమశాస్త్ర నియమాల ప్రకారమే బోనం సమర్పించాలని నిర్ణయించామని, అయితే అక్కడ జంతుబలులు ఇస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. "అమ్మవారు శాకాహారి అనే విషయం అందరికీ తెలుసు. ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్న అర్చకుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకొచ్చి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తాం" అని సురేఖ స్పష్టం చేశారు.

### కడియం నామోషీ ఫీలవుతున్నారు

ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కూడా మంత్రి సురేఖ తీవ్ర ఆరోపణలు చేశారు. కడియం శ్రీహరిని ఉద్దేశించి మాట్లాడుతూ, తాను మంత్రిగా ఉండటం చూసి కడియం నామోషీగా భావిస్తున్నారని అన్నారు. "అందుకే నా మంత్రి పదవి పోతుందని ఆయన తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి వద్దకు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు వెళ్లి నాపై లేనిపోనివి చెబుతున్నారు" అంటూ సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నాకు అదృష్టం ఉంది కాబట్టి మంత్రి అయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యారు. అలాంటప్పుడు నన్ను మంత్రి పదవి నుంచి దిగిపోవాలని అనుకోవడం ఎంతవరకు సమంజసం? నా కుమార్తెకు అదృష్టం లేక ఎమ్మెల్యే కాలేదు. కడియం కుమార్తెకు అదృష్టం ఉంది కాబట్టి ఎంపీ అయ్యింది. అందుకోసం నేను ఆమె ఎంపీ పదవి తీసేయాలని అంటున్నానా?" అని మంత్రి సురేఖ ప్రశ్నించారు.

### పుష్కరాలకు నిధులు, కేంద్రంపై విమర్శలు

గోదావరి పుష్కరాల నిర్వహణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సమాన దృష్టితో చూడాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. పుష్కరాల కోసం కేంద్రం రూ. 200 కోట్లు కేటాయించాలని కోరుతూ లేఖ రాసినట్లు తెలిపారు.

"ఆంధ్రప్రదేశ్తో పోలిస్తే తెలంగాణలోనే గోదావరి పుష్కరాలు అధికంగా జరుగుతాయి. భద్రాచలంలోని శ్రీరాముని పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుంది, ఇక్కడే పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం" అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపడం తగదని హితవు పలికారు. గోదావరి పుష్కరాల నిధుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని, లేనిపక్షంలో వారు చేతకాని మంత్రులుగా చరిత్రలో నిలిచిపోతారని ఆమె వ్యాఖ్యానించారు.

# పార్క్ విల్లాలో పాదయాత్ర

**- ముద్దం నర్సింహా యాదవ్**



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ ప్రాంతంలో కార్పోరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఫోకస్ పెట్టారు.ప్రజల ఫిర్యాదు మేరకు డివిజన్ పరిధిలో ఎక్కడ ఏ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారో అక్కడిక్కడే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తున్నారు.ఈ నేపథ్యంలో నిన్న శుక్రవారం ఓల్డ్ బోయిన్ పిల్లి 119 డివిజన్ లో అస్మత్ పెట్ (పార్క్ విల్లా కాలనీ %ఒ% అబ్రార్ నగర్ లో)పర్యటిస్తూ అన్ని విభాగాల అధికారులతో కలిసి రివ్యూ పాదయాత్ర చేసిన డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్.అయితే స్థానిక ప్రజలను సమస్యల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పార్క్ విల్లా కాలనీ,అబ్రార్ నగర్లో భూగర్భ డ్రైనేజ్ సమస్య,విద్యుత్ స్తంభాలు,వీధి దీపాలు, మంచినీరు సరఫరా తదితర సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన గమనించారు.

వివిధవిభాగాలకు చెందిన అధికారులకు సూచనలు చేస్తూ వీలైనంత త్వరగా సమస్యలు పారద్రోలే విధంగా చర్యలు తీసుకోవాలని ముద్దం కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ డిఈ నిఖిల్ ఏఈ ఆశ,వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, సూపర్వైజర్ లక్ష్మణ్ రమేష్ టౌన్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ ప్రవీణ్,ట్రీ కటింగ్ గణేష్, జిహెచ్ఎంసి జవాన్ రాజు, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్ గౌడ్, ఎలక్ట్రికల్ లైన్మెన్ సురేష్, ప్రసాద్ స్ట్రీట్ లైట్ కృష్ణ.కూకట్పల్లి నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ భాయ్ డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ బాయ్ జనరల్ సెక్రెటరీ హరినాథ్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి ,విష్ణు,ఈరాలాల్, యూసుఫ్ బాబా బాయ్ జెకె బాయ్ మోహిత్ ఖాదర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# హీటెక్కిన బోర్డు సమావేశం సిఇవో వర్సెస్ ఎమ్మెల్యే





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** కంటోన్మెంట్ బోర్డ్ కార్యాలయంలో సాధారణ బోర్డు సమావేశం జరిగింది.ఈ బోర్డు సమావేశానికి నూతనంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడిగా,స్టేషన్ కమాండర్ ఎస్.రాజీవ్ పదవి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్,బోర్డు సీఈవో మధుకర్ నాయక్,సివిల్ మెంబర్ భానుక నర్మద నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన రాజీవ్ కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నాలాల అన్యాక్రాంతం పై హైడ్రాకు పలు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్యాట్నీ నాలా పై ఉన్న అక్రమ నిర్మాణాలను ఫిర్యాదు అందిన 48 గంటల్లోనే తొలగించినట్లు కంటోన్మెంట్ సీఈఓ అధ్యక్షుడు దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా వారం రోజుల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో కంటోన్మెంట్ లోని నాలా పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.బోర్డు పరిధిలో ఉన్న ప్యాట్నీ నాలాను పునరుద్ధరించడానికి రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం అత్యధికంగా నిధులు ఖర్చు అవుతున్న నేపథ్యంలో హెచ్ఎండిఏ ద్వారా ఆ పనులను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్లో నూతనంగా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే కానీ బోర్డులో నివసించే సగటు పౌరులు ఎవరైనా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే మార్ట్ గేజ్ చేయడానికి 30 రోజుల కాలవ్యవధి ప్రక్రియని వెసులుబాటు కలిగించినట్లు సీఈఓ తెలిపారు.అలాగే ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు వెడల్పులో భాగంగా నాగపూర్ హైవేకి చెందిన బలంరాయి పంపు హౌస్ 35% రోడ్డు వెడల్పులో కోల్పోతున్నట్లు, దానికి పరిహారంగా పది లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు నిర్మించేందుకు హెచ్ఎండిఏ సహకారంతో పంపు హౌస్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అదిగాక బోయిన్ పల్లి పంప్ హౌస్ కూడా కొంత మేరకు రహదారి వెడల్పులో నష్టపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న తిరుమలగిరి రామన్నకుంట చెరువులను సుందరీకరణ చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం ఇతర వసతులు కల్పిస్తూ ఆహ్లాదకరమైనవాతావరణాన్ని ఏర్పాటు చేసే విధంగా రూపకల్పన చేస్తున్నట్లు సిఇవో పేర్కొన్నారు.కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని,కంటోన్మెంట్ ప్రాంతంలో నీటి సరఫరాకు సంబంధించి వాటర్ బోర్డ్ సరఫరా చేసే 1 ఎంజిడి అదనపు నీటిని నిలువ చేసుకునే సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్లు నిర్మించడానికి సిద్దంగా ఉన్న నేపథ్యంలో అనువైన ప్రాంతాలను గుర్తించి నివేదిక అందించాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. రామన్నకుంటను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని బోర్డు నుంచి ఎన్వోసి ఇవ్వాల్సి ఉందని ఎమ్మెల్యే బోర్డు మీటింగ్ లో ప్రస్తావించారు. అలాగే ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఓ సారి ఎన్నికలు జరగాలని, కంటోన్మెంట్ లో గత ఐదేళ్లుగా ఎన్నికలు జరగకుండా నిమినేటెడ్ సభ్యులతో పాలన సాగుతోందని,కంటోన్మెంట్ లో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు అందుబాటులో ఉంటే ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించే వెసులు బాటు ఉంటుందని కంటోన్మెంట్ లో బోర్డు ఎన్నికలు జరిపించేలా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బోర్డ్ ప్రెసిడెంట్ ఎస్.రాజీవ్ నీ కోరారు.

దీంతో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ నుండి 1152 కోట్లు సర్వీస్ చార్జీల బకాయిలు వెంటనే చెల్లించి కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వము బోర్డు తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన బాధ్యతలు చేపట్టిన బ్రిగెడియార్కి విజ్ఞప్తి చేశారు. అలాగే కంటోన్మెంట్ ఎనిమిది వార్డులలో గతంలో అక్రమ నిర్మాణాలు ఎక్కువై బోర్డు అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న విషయాన్ని బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేష్ లేవనెత్తారు. మరో విషయం ఏంటంటే బోర్డు లీగల్ ప్యానెల్ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణదారుల పై ఎలాంటి చర్యలు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు.అలాగే పూణే కోర్టులో వందల సంఖ్యలో పిటిషన్లు పేరుకుపోవడానికి గల కారణం బోర్డు లీగల్ ప్యానల్ నిర్లక్ష్య వైఖరే తార్కానమని అన్నారు.ఈ సమావేశంలో కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణి కుమార్, వాటర్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్,నిత్యనంద్, బోర్డు కార్యనిర్వహణాధికారి హోని తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల అర్జీలు 2246

# - రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్

**-జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్ గ్రామ భూభారతి రెవెన్యూ సదస్సుల్లో విశేష స్పందన**

**-గిర్దావర్లు భూమయ్య, శంషోద్దీన్**

**-మిస్సింగ్ సర్వే నెం,విస్తీర్ణం సవరణ పట్టాదారు, తండ్రి పేరు సవరణ, పెండింగ్ మ్యుటేషన్, పెండింగ్ విరాసత్,సాదాబైనామ**



**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** జగిత్యాల రూరల్ మండలం భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుండి అందిన మొత్తం అర్జీలు 2246 అని రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్ గ్రామంలో గల రైతుల నుండి భూ సమస్యలపై మిస్సింగ్ సర్వే నెం, విస్తీర్ణం సవరణ పట్టాదారు, తండ్రి పేరు సవరణ, పెండింగ్ మ్యుటేషన్, పెండింగ్ విరాసత్,సాదాబైనామ ద్వారా కొనుగోలు చేసి పట్టా మార్పిడి చేసుకోలేక పోయిన, తదితర భూ సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న కొత్త చట్టం భూభారతి ద్వారా రైతులకు మేలు జరిగేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్నామని జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్ గ్రామములో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు.ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా తయారయింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్లు భూమయ్య, శంషోద్దీన్, సీనియర్ సహాయకులు గంగారాం, జూనియర్ సహాయకులు నిరంజన్, రాజేందర్, భాస్కర్, గంగరాజం, సల్మాన్, రషీద్,పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

# మధుర చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివి: బండారి లక్ష్మారెడ్డి

**- ఉపాధ్యాయులను తల్లిదండ్రులను గౌరవించాలి**

**- సెల్ ఫోన్లతో సమయాన్ని వృధా చేసుకోకుండా బంగారు భవిష్యత్తు కై బాటలు వేయండి**

**- నేటి పిల్లలు రేపటి యువతరానికి మార్గదర్శకులు కావాలి**





**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** హబ్సిగూడ డివిజన్ లో జిల్లా పరిషత్ హై స్కూల్లో మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు స్టడీ మెటీరియల్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకం తో పాటు, ప్రధమ శ్రేణి, ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి, బ్యాచ్ లను మరియు ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నేటి బాలలు రేపటి తరానికి మార్గదర్శకులు కావాలని, ఉపాధ్యాయులను తల్లిదండ్రులను గౌరవించాలని, సెల్ ఫోన్లతో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా తమ భవిష్యత్తు కై బంగారు బాటలు వేసుకోవాలని, పట్టుదలతో ఏదైనా సాధించగల శక్తి మనలో ఉందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు రాజకీయాల్లో, కార్పొరేట్ సంస్థలో వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, బిల్డర్లుగా, ఎదిగిన వారు ఉన్నారని, ఉపాధ్యాయులు ప్రైవేట్ విద్యాసంస్థ ల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతున్నారని పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను గత 26 సంవత్సరాల నుండి మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని, పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తన వంతు సహాయంగా నోటి పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, ప్లేట్లు, అందజేస్తున్నానని,అలాగే క్రీడా సామాగ్రి మరియు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకం తో పాటు, ప్రధమ శ్రేణి, ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి, విద్యార్థులకు ఆర్థికంగా పై చదువులు చదవలేని విద్యార్థిని విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు, విదేశీ చదువులు చదువుకునే వారికి ప్రోత్సాహకాలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేయడం జరుగుతుందని రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థిని విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన ఘనత మధుర చారిటబుల్ ట్రస్ట్ ది అని ఆయన తెలియజేశారు.రాబోవు రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లో ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడతామని రాగిడి లక్ష్మారెడ్డి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చారి, లక్ష్మీనారాయణ, యాదగిరి, కాలేరు జె నవీన్, భాస్కర్ ని నరేందర్ రాజు, రాజమోహన్ రెడ్డి, సంజయ్ జైన్,వీరేందర్, వంజరి సంతోష్, మహిళా నాయకురాలు,మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుద్ధ నిర్వహణపై పర్యవేక్షిస్తున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)**జగిత్యాల 10 వ వార్డు లింగంపేట్ లో పరిశుద్ధ నిర్వహణపై పర్యవేక్షణ చేసిన జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఐఏఎస్.

## న్యాయ నిరూపణ జరగాలంటే సరైన ఆధారాలు

# నేర దర్యాప్తు చాల కీలకమైనది : ఎస్పి అశోక్ కుమార్

**-జిల్లా స్థాయి రెండవ పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ**

**-విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం సాధించాలి**



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం సాధించాలి అని ఆదేవిదంగా న్యాయ నిరూపణ జరగాలంటే సరైన ఆధారాలు, నేర దర్యాప్తు చాల కీలకమైనదని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. గౌరవ డిజిపి గారి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా స్దాయి పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని పోలీస్ ప్రదాన కార్యాలయంలో ఎస్పి ప్రారంభించారు. ఈ డ్యూటీ మీట్ లో పోలీస్ అధికారులు నిరంతరం నిర్వహించే విధులకు సంబంధించి వివిద విబాగాలో పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్,హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిల విభాగంలో ట్రాకింగ్, ఎక్స్ప్లోజివ్ విభాగాల్లో, ఫోటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలను నిర్విహించబడుతాయి. ఈ పోటీల్లో విభాగాల వారిగా రాణించిన వారిని జోనల్ స్థాయిలో నిర్వహించబడే పోలీస్ డ్యూటీ మీట్ ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకునేందుకు పోలీస్ డ్యూటీ మీట్ దోహదపడుతుందన్నారు. అదేవిధంగా పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానిక చక్కని వేదిక అన్నారు. ఈ యొక్క డ్యూటీ మీట్లో ఉత్తమ ప్రతిభ చూపాలని అన్నారు. జాతీయ స్దాయిలో జరిగే పోలీస్ డ్యూటీ మీట్ విజేతలకు మంచి గుర్తింపు వుంటుందని అన్నారు. ప్రతిభ చూపిన వారికి రాష్ట్రాలు,జాతీయ స్థాయిలో జరిగే పోలీస్ డ్యూటీ మీట్ కు వివిధ ప్రాంతాల నుండి పోలీసు అధికారుల మధ్య మరింత సహకారం, ప్రోత్సహం లభిస్తుందని అన్నారు. సంక్లిష్టమైన కేసులు పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రదర్శనను అందించాలని మరియు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డిఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, రాములు, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, రఫీ ఖాన్, శ్రీధర్, సుధాకర్, కరుణాకర్, రవి, సురేష్ ,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సైదులు మరియు ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ లను వెంటనే అరెస్ట్ చేయాలి

**ఔటర్ టెండర్లలో రూ.7,380 కోట్ల అవినీతి జరిగినా పట్టించుకోరా..?**

**ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడమే పెద్ద స్కామ్**

**బాండ్ల ద్వారా బీఆర్ఎస్ క్విడ్ ప్రోకో**

**కైటెక్స్ కాంట్రాక్టులోనూ అక్రమాలు**

**ప్రజాధనం లూటీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఏసీబీకి బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజు టెండర్లు మరియు కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటులో భారీగా అవినీతి జరిగినా పట్టించుకోరా...? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు.ఈ మేరకు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)డీజీని కలిసి...కేసీఆర్ , కేటీఆర్ లతో పాటు బీఆర్ఎస్ కు చెందిన ఇతర ముఖ్యనేతలపై వెంటనే కేసు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరపాలని కోరారు.అనంతరం ఆయన ఏసీబీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ...ఔటర్ టోల్ టెండర్ పొందిన ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థ నుంచి, కైటెక్స్ గార్మెంట్స్ నుంచి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు అందాయని పేర్కొన్నారు.నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ క్విడ్ ప్రోకోకు పాల్పడటం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేశారని తెలిపారు.ఐఆర్బి ఇన్ ఫ్రా సంస్థకు 30 ఏళ్లపాటు ఔటర్ టోల్ వసూళ్లను అప్పగించడం పెద్ద కుంభకోణం అని, ఇందులో రూ.7,380 కోట్ల అవినీతి జరిగిందని అన్నారు.నిర్వహణ ఖర్చు ఎక్కువ అయ్యే ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలో ఉంచి, ఆదాయం వచ్చే మార్గాన్ని ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు కట్టబెట్టారని తెలిపారు.2023 ఏప్రిల్ 27న ఐఆర్బీకి ఔటర్ టోల్ కాంట్రాక్ట్ దక్కితే.. 2023 జూలై 4న ఐఆర్బీ సంస్థ రూ.25 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆ ర్ఎస్ పార్టీకి ఇచ్చిందని, వారం రోజుల్లోనే ఆ డబ్బును బీఆర్ఎస్ విత్ డ్రా చేసుకుందని వివరించారు. తద్వారా క్విడ్ ప్రోకో చోటుచేసుకుందని పేర్కొన్నారు.వరంగల్, రంగారెడ్డి జిల్లాలో కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటు విషయంలోనూ ఇలాగే క్విడ్ ప్రోకో జరిగిందన్నారు. 2023 జూన్ 16న వరంగల్ కైటెక్స్ కంపెనీ రూ.15 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొంటే%ఎ%మర్నాడే బీఆర్ఎస్ పార్టీ వాటిని ఎన్ క్యాష్ చేసుకుందని వెల్లడించారు.రంగారెడ్డి జిల్లాలోనూ కైటెక్స్ కంపెనీ 2023 సెప్టెంబరు 12న రూ.10 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆర్ఎస్ పార్టీకి ఇవ్వగా, అక్టోబరు 16న ఆపార్టీ వీటిని ఎన్ క్యాష్ చేసుకుందని చెప్పారు.అధికారాన్ని అడ్డం పెట్టుకుని, వేల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసిన కేసీఆర్, కేటీఆర్ పై వెంటనే కేసులు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరిపి అరెస్ట్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్ గౌడ్, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రేనట్ల మల్లేష్ ,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల వినోద్ సాగర్, మ్యాదరి రాజ, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## “4”రు అగంతకులు ఆర్మీ ప్రాంతంలో సంచారం



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న తిరుమలగిరిలో ఆర్మీ అధీనంలో ఉన్న ప్రాంతంలోకి అక్రమంగా చొరబడిన నలుగురు వ్యక్తులను తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేశారు. తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ ఇంజనీరింగ్ కళాశాల టెక్నో చౌక్ గేటులోకి అనుమతి లేకుండా నకిలీ వైమానికదళ అధికారి గుర్తింపు కార్డులతో ఎయిర్ ఫోర్సు దుస్తులను లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఆర్మీ రహస్య ప్రాంతంలో ఫోటోలు, వీడియోలు చిత్రీకరిస్తుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ అధికారులు వారిని ప్రశ్నించారు. ఆర్మీ ప్రాంతంలోని కీలక సమాచారంపై ఫోటోలు, వీడియోలు తీసుకోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం కావడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకున్న ఎయిర్ ఫోర్స్ ఇంటెలిజెన్స్ అధికారులు అన్ని కోణాలలో విచారించి తిరుమలగిరి పోలీసులకు అప్పగించారు. లెఫ్టినెంట్ కల్నల్ ఫిర్యాదుతో తిరుమలగిరి పీఎస్‌లో కేసు నమోదు అయింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని పేరుతో వాళ్లు లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ మరి ఏదైనా జాతీయ భద్రత అంశం సంబంధించిన కోణం లో కూడా దర్యాప్తు జరుపుతున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతూ ఫోటోలు వీడియోలు తీసుకున్న నలుగురు వ్యక్తులను (ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు) రాకేష్ కుమార్, ఆశిష్ కుమార్, ఆలియా అబ్బీ, నగ్మభానూ లు పోలీసుల విచారణలో ఉన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** ఈనెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రమంతటా అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ రూపదేవి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోనూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో



భాగంగా పట్టణంలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పంచాయతీరాజ్ అతిధి భవనం వరకు ఉన్న ప్రహరీ గోడలపై యోగాసనాలు చిత్రాలను గీయించారు. వివిధ ఆసనాలు ఉన్న చిత్రాలను ఈ మార్గంలో వెళ్తున్న పలువురు ప్రయాణికులు, స్థానికులు విద్యార్థిని, విద్యార్థులు ఆసక్తిగా వీక్షిస్తున్నారని ఆమె తెలిపారు.

## అట్టహాసంగా ప్రగతి చక్రం పురస్కారాలు




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ బస్ డిపోలో ప్రగతి చక్రం పురస్కారాలను అట్టహాసంగా నిర్వహించారు. మే నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లకు, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను మెయింటనెన్స్ చేసిన మెకానిక్ లను డిపో మేనేజర్ సుధాకర్ శాలువా కప్పి ప్రశంసా పత్రాలతో సన్మానం చేశారు. ఈ ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ మే నెలలో అత్యధిక ఇన్సెంటివ్ తీసుకురావడంతోపాటు అత్యధిక ఇంధనం పొదుపు చేయడం, బ్రేక్ డౌన్ లేకుండా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి రామారావు, అసిస్టెంట్ ఇంజనీర్ మీ స్నేహలత, పిఎస్ఎన్ రావు హనుమంతు తదితరులు పాల్గొన్నారు

## బిజేపితోనే వెలుగులు, బస్తీలో విద్యుత్ దీపాలు: తిరుపతి



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా హరిజన బస్తీ చీకటిలో పరిషాన్ పడుతూ, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మోర పెట్టుకున్న కనికరించలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పక్షం రోజుల క్రితం బోయిన్ పల్లి డివిజన్ భాజపా నాయకులు ఏనుగుల తిరుపతిని ఆశ్రయించిన జయశంకర్ నగర్,హరిజనబస్తి వాసులు. ముఖ్యంగా మౌళిక సదుపాయాలు విషయంలోరాజీ పడాల్సిన అవసరం లేదని యుద్ధప్రాతిపదికన మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ చొరవతో 12 వీధి దీపాలు అమర్చిన విషయం అందరికి తెలిసిందే. నిన్న శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన కొత్త స్తంభాలకు విద్యుత్ దీపాలు వెలిగించినసిబ్బంది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు మక్కల, శేఖర్ అశోక్ రమేష్ అరుణ్ హర్జీత్ మణి వరుణ్ తిరుపతి కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మేడిపల్లి రూపాదేవి స్మారకంగా మండల కాంగ్రెస్ నేతల సేవా కార్యక్రమం

- కస్తూర్బా గాంధీ హాస్టల్ విద్యార్థులకు చల్లని నీరు మిషన్ వితరణ
- మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి మొదటి వర్ధంతి





**బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మొదటి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం బోయినిపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో రూపాదేవి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రూపాదేవి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె జ్ఞాపకార్థంగా బోయినిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు వాటర్ కూలర్‌ను (చల్లని నీరుగా మార్చే మిషన్) ను వితరణ చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వాటర్ కూలర్‌ను కాంగ్రెస్ నాయకులు వన్నెల రమణారెడ్డి, కూస రవీందర్, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, బోయిని ఎల్లేష్,నిమ్మ వినోద్ రెడ్డి,ఏనుగుల అనిల్ కుమార్ సౌజన్యంతో ఏర్పాటు చేసి విద్యాలయానికి అందజేయడం జరిగింది.

దాతలు మాట్లాడుతూ

### కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి మాట్లాడుతూ

“రూపాదేవి సామాజిక సేవ పట్ల చూపిన నిబద్ధతను గుర్తు చేసుకుంటూ, ఆమె జ్ఞాపకార్థంగా ఈ చిన్నపాటి సేవా కార్యక్రమం చేపట్టాం. విద్యార్థుల కోసం మేము అందించిన ఈ వాటర్ కూలర్, వేసవిలో వారికి ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నాం,” అని తెలిపారు.

### జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ మాట్లాడుతూ

“వర్ధంతి వేళ రూపాదేవిని స్మరించుకోవడం మాతో పాటు, సమాజానికి ఉపయోగపడే విధంగా చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం,” అని పేర్కొన్నారు.

### - వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ

“విద్యార్థుల అవసరాలు గుర్తించి, మేము ఈ వాటర్ కూలర్ ఏర్పాటు చేశాం. రూపాదేవి సేవా ఆత్మను స్మరించుకుంటూ, ఇదే మార్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం,” అని హామీ ఇచ్చారు. అలాగే తదితర దాతలు సైతం రూపాదేవి చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు ఎమ్మెల్యే గా డాక్టర్ మేడిపల్లి సత్యం గెలుపులో కీలక పాత్ర పోషించిన ఆమె సేవలను కొనియాడుతూ మున్ముందు ఇదే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ముక్త కంఠంతో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు పులి లక్ష్మీపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, సంబ లక్ష్మీరాజం,అక్కెనపల్లి ఉపేందర్, పిట్టల రమేష్,మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కనుకయ్య,నల్ల మోహన్, వంగపెల్లి సత్యనారాయణ రెడ్డి, ఎండి మమ్మద్, సువిన్ యాదవ్, మండల శ్రీనివాస్, వెంకటేష్, మెరుపుల మహేష్, గుడి రాజశేఖర్ రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి,ముదాం శ్రీనివాస్, గోపాల్ మైపాల్ రెడ్డి, నక్క శ్రీకాంత్, బోయిని మల్లేశం, గుంటి జలంధర్, బోయిని పరశురాం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కస్తూర్బా గాంధీ హాస్టల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చేనేత పక్షాన ప్రజా ప్రభుత్వం-రూ.11కోట్లతో ప్రణాళిక

- పద్మశాలీల పట్ల నిబద్ధత చాటుకున్న ప్రభుత్వం
- త్వరలోనే సిరిసిల్లలో పద్మశాలి భవన్, మార్కండేయ ఆలయం నిర్మాణం పూర్తి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే: ఆది శ్రీనివాస్



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి భవన్,మార్కండేయ ఆలయం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. హైదరాబాద్,నాంపల్లి లోని చేనేత భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సమావేశానికి చేనేత జౌళి శాఖ కమీషనర్ శైలజా రామయ్య, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు హాజరయ్యారు.



### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

సిరిసిల్లలో నిర్మాణంలో ఉన్న పద్మశాలి కుల సంఘం భవనం,మార్కండేయ స్వామి ఆలయాన్ని త్వరలోనే పూర్తి చేయనున్నట్లు,బీసీ సంక్షేమ శాఖ ద్వారా రూ.5 కోట్లు మంజూరయ్యేలా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. టెస్కో ద్వారా కూడా నిధుల కోసం ప్రస్తావన తెచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే పిల్లర్లు వేసిన భవన నిర్మాణాన్ని స్లాబ్ వరకు తీసుకెళ్లిన తరువాత, రూ.3.40 కోట్లతో కళ్యాణమండపం నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ భవనంలో పద్మావతి అమ్మవారి దేవాలయాన్ని కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. మరో రూ.2 కోట్లతో మార్కండేయ ఆలయ నిర్మాణం పూర్తిచేసి, మొత్తం రూ.11 కోట్లతో ఈ రెండు నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

### - చేనేత రంగానికి మద్దతు

పెండింగ్‌లో ఉన్న చేనేత బిల్లులన్నింటినీ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పవర్లూమ్ కార్మికులకు స్థిరమైన ఉపాధి కల్పించాలని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు చీరలు అందిస్తున్నామని ఆది వెల్లడించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చేనేత కార్మికులకు అంత్యోదయ కార్డులు అందించి భరోసా కల్పించిన విషయం గుర్తుచేశారు. ఇకపై చేనేత, పవర్లూమ్ కార్మికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

### - యారన్ డిపోపై కీలక ప్రకటన

చేనేత కార్మికుల కోరిక అయిన రూ.50 కోట్లతో యారన్ డిపో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, బీసీ వెల్ఫేర్ అధికారి బల మాయదేవి, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా భాజపా రచ్చబండ

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా భాజపా ప్రభుత్వం
- రచ్చబండ కార్యక్రమంలో మోదీ పాలనపై ప్రశంసలు
- భాజపా మండల అధ్యక్షులు : ఎడపల్లి పర్శరాములు



**బోయినపల్లి, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి,విలాసాగర్, బోయినిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎడపల్లి పర్శరాములు ఆధ్వర్యంలో “రచ్చబండ” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వికసిత్ భారత్ లక్ష్యంతో బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా మండల బీజేపీ అధ్యక్షులు ఎడపల్లి పర్శరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– “పేదల సంక్షేమం, సేవా సుపరిపాలనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ నూతన దిశగా ప్రయాణిస్తోంది. మోడీ 11 ఏళ్ల పాలనలో దేశం గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. ప్రతి సవాలుని ధైర్యంగా ఎదుర్కొంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు” అన్నారు. ఆపరేషన్ సింధూర్, స్వదేశీ క్షిపణుల వినియోగం, రక్షణ రంగంలో 34 రెట్లు ఎగుమతుల వృద్ధి వంటి విషయాలను ప్రస్తావిస్తూ దేశ గౌరవం, భద్రతకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కరోనా సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

### -సంక్షేమ పథకాల ప్రస్తావన

ఉజ్వల యోజన,గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, కిసాన్ సమ్మాన్




నిధి, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛభారత్ వంటి పథకాల ద్వారా మోడీ పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని అన్నారు. ఇప్పటివరకు 3.7 లక్షల కోట్లు రైతుల ఖాతాలలోకి నేరుగా నిధులు జమ చేయడం జరిగిందన్నారు.

### - యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

జూన్ 21న శనివారం నేడు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగాను ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు స్వీకరించడంలో మోడీ పాత్ర గర్వించదగినదని పేర్కొన్నారు.

### - స్థానిక ఎన్నికల పిలుపు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కాషాయ జెండా ఎగరాలని, ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రచ్చబండ ఇంచార్జి ఉదారి నరసింహా చారి (భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యుడు),భాజపా మాజీ మండలాధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్వామి కుమార్, పసిగంటి వెంకటేష్, బూత్ అధ్యక్షులు సుంకపాక ప్రభు, రేగుల రమేష్, బోగోజి గంగాధర్ చారి, గైశెట్టి ప్రశాంత్, నాయిని నాగరాజు, కిరణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

**బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ నేతృత్వంలో మత్తు దుష్పరిణామాలపై అవగాహన సదస్సును కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్ కుమార్ విద్యార్థులకు మత్తు పదార్థాలు, గంజాయి వంటి నిషేధిత పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. “చిన్న వయసులోనే విద్యార్థులు మత్తుకు బానిసై చెడు అలవాట్లలోకి జారిపోతున్నారు. ఈ పరిస్థితి నేరాలకు దారితీసే ప్రమాదం ఉంది. అందువల్ల యువత సరైన దారిలో ముందుకు సాగుతూ, మంచి విద్యను అభ్యసించి, ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి” అని సూచించారు. విద్యార్థులు సమాజ నిర్మాణంలో పాజిటివ్ పాత్ర పోషించాలని, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని పిలుపునిచ్చారు.





## మెగా ఫోన్ పట్టనున్న
# చందమామ?

నటి కాజల్ అగర్వాల్ మెగా ఫోన్ పట్టనున్నారు. కెరీర్ పీక్స్ ఉన్నప్పుడే తన చిరకాల మిత్రుడు గౌతమ్ కిచ్లుని పెళ్లాడేసి, వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన ఈ అందాల చందమామ.. 'భగవంత్ కేసరి'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలపెట్టారు. ఆ సినిమా ఘన విజయం సాధించినా ఆ క్రెడిట్ అంతా బాలకృష్ణ, అనిల్ రావిపూడిల ఖాతాలో పడిపోవడంతో కాజల్‌కి మాత్రం ఆ స్థాయి అవకాశం మళ్లీ రాలేదు.

ఈ నెలలోనే ఆమె పార్వతీదేవి పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే రెండు దశాబ్దాల తన అనుభవాన్నంతా క్రోడీకరించి, ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించేందుకు కాజల్ సిద్ధమయ్యారని బీటౌన్ టాక్. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన విడుదల కానుంది.

# 'పెద్ది'లో రామ్ బుజ్జిగా దివ్యేందు..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్ ఫేమ్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. గురువారం మేకర్స్ ఆయనకి బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే ఆసక్తికరమైన క్యారెక్టర్‌లో ఆయన కనిపించబోతున్నారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన దివ్యేందు పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మాసివ్ సెట్లో హై-ఆక్టేన్, హై బడ్జెట్‌తో ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నారు. ఈ మైండ్- బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## మధ్య తరగతి కుటుంబాలను
# ప్రతిబింబిస్తూ..



సెవెన్ హిల్స్ బ్యానర్‌పై వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా నటిస్తుండగా పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించారు. పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, షఫీ, ఆర్కే మామ, భద్రం ఆనంద్ చక్రపాణి, సూర్య, ల్యాబ్ శరత్, అరుణ్ కుమార్, రజిని వర్మ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. జూలై 4వ తేదీన వెండి తెరపై ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనున్న సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేయడం జరిగింది. అయితే ఇటీవలే ఆపరేషన్ సింధూర్‌లో అమరుడైన జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ... "చిత్ర ట్రైలర్ ఎంతో బాగుంది. చాలా మంచి విజువల్స్ కనిపించాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. చిత్ర దర్శకుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. "సోలో బాయ్ చిత్రం మధ్య తరగతి కుటుంబాలను ప్రతిబింబిస్తూ ఉంటుంది. గౌతమ్ కృష్ణ ఎంతో అద్భుతంగా నటించారు"అని అన్నారు. చిత్ర నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ.. "సోలో బాయ్ అనగానే ఎంతోమంది సోలోగా వచ్చి ఉన్నత స్థాయికి చేరిన వారు నాకు గుర్తొస్తారు"అని పేర్కొన్నా రు. హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాలను ఆధారంగా చేసుకుని తీసిన చిత్రమిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి పట్నాయక్, సుధాకర్, యాట సత్యనారాయణ పాల్గొన్నారు.

## విచిత్ర సమస్యతో
# 'ఉప్పు కప్పురంబు'



ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై లి.బ్యానర్ పై రాధిక లావూ నిర్మాణంలో ఐ.వి.శశి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. వసంత్ మరింగంటి రచించిన ఈ చిత్రంలో సుహాస్, కీర్తి సురేష్ ప్రధానపాత్రలు పోషించగా, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమా మన దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలలో జూలై 4న ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మళయాళం, కన్నడ, ఇంగ్లీష్‌తో కలిపి 12 భాషలలో సబ్‌టైటిల్స్‌తో ఇది ప్రసారం కానుంది. 1990లో చిట్టి జయపురం అనే పల్లెటూరి ఒక చిత్రమైన సమస్యని ఎదుర్కొంటూ ఉంటుంది. ఈ ఊరిలో మరణించినవారిని పూడ్చిపెట్టటానికి చోటు లేదు. కొత్తగా నియమించబడిన, ఆదర్శవంతురాలైన గ్రామాధికారి, అపూర్వ (కీర్తి సురేష్), ఆ ఊరి కాటికాపరి చిన్న (సుహాస్) ఈ సమస్యను పరిష్కరించడానికి ఏం చేశారనేది ఆద్యంతం హాస్యభరితంగా సాగునుంది. కీర్తి సురేష్ మాట్లాడుతూ, 'ఇందులో అపూర్వ అనే భిన్నమైన పాత్ర చేశాను. ఆమె ఆదర్శవాది, దృఢనిశ్చయం కలిగినది. ఈ సినిమాలో ఉన్న సమస్య నన్ను బాగా కదిలించింది' అని తెలిపారు. 'చిన్నా పాత్ర ఇదివరకు నేను చేసిన పాత్రల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇతను ఒక విచిత్రమైన పరిస్థితిలో ఇరుక్కుంటాడు. ఆ పరిస్థితి ఏంటి? అనేది ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ సినిమా నీతులు చెప్పేదిగా ఉండదు' అని సుహాస్ అన్నారు.

# 'నాగబంధం' కోసం 5000 మంది డ్యాన్సర్లు



విరాట్ కర్ణ హీరోగా దర్శకుడు అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న పాన్-ఇండియా చిత్రం 'నాగబంధం'. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్ఐకె స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం మేకర్స్ ఒక కీలకమైన సన్నివేశాన్ని, ఒక పాటను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన అనంత పద్మనాభ స్వామి ఆలయం సెట్‌లో పాటను చిత్రీకరించారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య పర్యవేక్షణలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్యకారులు ఈ పాటలో పాల్గొన్నారు. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించారు. 'నాగబంధం' ఒక విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో ఈ సినిమా ఉంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయల చుట్టూ ఉన్న రహస్యాన్ని ఇందులో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

# హాయ్ నాన్న కాంబో రూటు మారుస్తోంది



మంచి ఎమోషనల్ మూవీగా బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న హాయ్ నాన్న విడుదలై ఏడాదిన్నర గడిచిపోయింది. ఇప్పటిదాకా దర్శకుడు శౌర్యువ్ కొత్త సినిమా మొదలు కాలేదు. ఇన్ సైడ్ టాక్ ప్రకారం అతను జూనియర్ ఎన్టీఆర్ కోసం విశ్వప్రయత్నం చేశాడు. ఒక కథ గురించి ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదిరినా తారక్ డేట్లు ఇంకో రెండు మూడేళ్ళ దాకా దొరికే పరిస్థితి లేకపోవడంతో శౌర్యువ్ అప్పటిదాకా వెయిట్ చేయడం కష్టం. దీంతో తిరిగి నాని దగ్గరికే వచ్చి ఓకే చేయించుకున్నట్టు తెలిసింది. ఇది అదే సబ్జెక్టా లేక వేరేదా అనేది తెలియాల్సి ఉంది. ఇదింకా ప్రాథమిక దశలో ఉంది కాబట్టి నిర్ధారణగా చెప్పలేం.ప్రస్తుతం నాని ఫోకస్ మొత్తం ది ప్యారడైజ్ మీదే ఉంది. ప్రస్తుతానికి చిన్న బ్రేక్ తీసుకున్నా జూలై నుంచి ఏకధాటిగా షూటింగ్ చేయబోతున్నారు. ప్రొడక్షన్ కే పది నెలల సమయం పట్టొచ్చని ఒక అంచనా. ఈ కారణంగా ముందు అనుకున్న మార్చి 26 విడుదల తేదీని మార్చుకునే అవకాశాలున్నాయని ఆల్రెడీ టాక్ ఉంది. ఇదిలా ఉండగా తాజాగా శౌర్యువ్ చెప్పిన కథ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో ఉంటుందట. హాయ్ నాన్నలో విపరీతమైన భావోద్వేగాలను చూపించిన ఈ దర్శకుడు ఈసారి కమర్షియల్ రూటు పట్టుకుని కొత్త తరహా స్టోరీ సిద్ధం చేశాడని అంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కారణాలు ఏమైనా శౌర్యువ్ లాంటి కొత్త డైరెక్టర్లు ఇన్నేసి నెలలు వెయిట్ చేసి కొత్త సినిమాలు మొదలుపెట్టకపోవడం టాలీవుడ్ లో తరచుగా కనిపిస్తూనే ఉంది. ఈ కారణంగానే సాయి రాజేష్, తరుణ్ భాస్కర్ లాంటి ప్యాన్ ఇండియాలు లేని దర్శకులు సైతం ఏడాదికి పైగానే గ్యాప్ తీసుకుంటున్నారు. ఇప్పటికే స్టార్ హీరోలు సంవత్సరానికి ఒక సినిమా రిలీజ్ చేయడమే కష్టంగా మారిపోయిన పరిస్థితుల్లో ఇలా అప్ కమింగ్ డైరెక్టర్లు కూడా అదే బాట పట్టడం థియేటర్లను నెలల తరబడి ఖాళీగా ఉంచుతోంది. ఇప్పుడు శౌర్యువ్ ఎవరి బ్యానర్ లో చేస్తాడు లాంటి వివరాలన్నీ అధికారిక ప్రకటన వచ్చే దాకా వేచి చూడాల్సిందే.

# పోలీస్ కేసు దాకా

## - వెళ్లిన యూట్యూబ్ రివ్యూ



టెక్నాలజీ ప్రపంచంలో కొత్త సినిమాలు వస్తే చాలు ఎవరైనా రివ్యూలు ఇచ్చేలా పరిస్థితి మారిపోయింది. కేవలం మీడియాలోనే కాదు యూట్యూబ్ ని వేదికగా చేసుకుని సమీక్షలు చేస్తూ లక్షలాది వ్యూస్ తో డబ్బు సంపాదించుకుంటున్న ఇన్ఫ్లుయెన్సర్లు వేలల్లో ఉన్నారు. కొన్నిసార్లు వీళ్ళు హద్దులు మీరిన దాఖలాలు లేకపోలేదు. అయితే ఒక దర్శకుడు వీటికి ఎదురీది ఏకంగా పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళిపోయాడు. అదేంటో చూద్దాం. గత వారం జూన్ 13న మలయాళంలో వ్యసన సమేతం బంధుమిత్రాదికల్ రిలీజయ్యింది. దీనికి టాలీవుడ్ షైన్ స్క్రీన్స్ అధినేత కం మెగా 157 నిర్మాత సాహు గారపాటి ప్రొడక్షన్ పార్ట్ నర్. వ్యసన సమేతం బంధుమిత్రాదికల్ కు రిపోర్ట్స్ బాగానే ఉన్నాయి. బుక్ మై షో ట్రెండింగ్ లో ఉంది. అయితే సినీఫైల్స్ అనే యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బిజిత్ విజయన్ తాను డిమాండ్ చేసినంత డబ్బు ఇవ్వకుంటే నెగటివ్ రివ్యూ చెబుతానని ఈ సినిమా దర్శకుడు కం సహ నిర్మాత ఎస్ విపిన్ ని బెదిరించాడట. అయితే ఇందుకు అతను అంగీకరించకపోవడంతో మూవీ గురించి బ్యాడ్ రివ్యూ ఇచ్చేసి దానికి పని చేసిన వాళ్ళను బెదిరించడం మొదలుపెట్టాడట. దీంతో ఒళ్ళు మండిన విపిన్ కేరళలోని పాలరిపట్టం పోలీస్ స్టేషన్ కు వెళ్ళిపోయి కంప్లయింట్ ఇచ్చాడు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అయినా ఉద్దేశపూర్వకంగా డబ్బులు ఆశించి ఇలా నెగటివ్ చేయడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు. ఒకవేళ నిజంగా సినిమా బాలేకపోతే ఆడియన్స్ బలవంతంగా చూడరు. రివ్యూలు బాగా ఇచ్చినా ఇవ్వకపోయినా వాళ్ళ నిర్ణయాలు వాళ్ళు తీసుకుంటారు.

# కుబేర కథ చెప్పేసిన కమ్ముల



తెలుగులో కొంత విరామం తర్వాత రాబోతున్న పెద్ద సినిమా.. కుబేర. తమిళ స్టార్ హీరోల్లో ఒకరైన ధనుష్ ఇందులో లీడ్ రోల్ చేయగా.. టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున ఓ కీలక పాత్రను పోషించారు. ఇప్పటిదాకా కెరీర్లో చాలా వరకు సెన్సిబుల్ లవ్ స్టోరీలే తీసిన శేఖర్ కమ్ముల.. ఈసారి చాలా సీరియస్‌గా సాగే ఒక బిచ్చగాడి కథను చెప్పాలనుకోవడం ఆశ్చర్యమే. 'కుబేర' టీజర్, ట్రైలర్ చూస్తే ఆ సినిమా కథ మీద ఒక అంచనాకు రాలేని పరిస్థితి. ఈ సినిమా స్టోరీ ఏంటి అంటూ కమ్ములను విలేకరులు అడగ్గా.. స్పాయిలర్స్ లేకుండా సింపుల్‌గా ఈ సినిమా లైన్ ఏంటో చెప్పాడు. అసలీ కథ ఎలా పుట్టిందో కూడా వివరించే ప్రయత్నం చేశాడు. 'కుబేర' చూసి ప్రేక్షకులు కచ్చితంగా ఆశ్చర్యపోతారని కూడా కమ్ముల ధీమా వ్యక్తం చేశాడు. "నేను ఏదో ఆలోచిస్తున్నపుడు ప్రపంచంలో అత్యంత ధనవంతుడికి, ఏమీ లేని పేదవాడికి మధ్య జరిగిన పోరాటాన్ని ఒక సినిమాగా చూపించాలని అనిపించింది. నిజానికి ఇది చాలా పెద్ద పాయింట్. కథగా చెప్పడం కష్టం. దాన్ని జాగ్రత్తగా రాసుకుని తెరపైకి తీసుకొచ్చా. ఒక్క మాటలో చెప్పాలంటే బిలియనీర్ వెర్సస్ బెగ్గర్ కథే కుబేర. ఈ రెండు భిన్న ప్రపంచాల మధ్య కనెక్షన్ ఏంటన్నది తెర మీదే చూడాలి. మీరెప్పుడూ చూడనిది చూస్తే ఎలా షాకవుతారో.. ఈ సినిమా చూసినపుడు కూడా అలాగే ఆశ్చర్యపోతారు. 'వావ్.. ఇదేం చిత్రంరా' అనిపించేలా ఉంటుంది" అని కమ్ముల చెప్పాడు. ఇక 25 ఏళ్ల కెరీర్లో పది సినిమాలు మాత్రమే చేయడం గురించి కమ్ముల స్పందిస్తూ.. వేరే వాళ్లకు ఇది తక్కువ అనిపిస్తుందేమో కానీ, తనకు మాత్రం చాలా ఎక్కువ అని వ్యాఖ్యానించడం విశేషం. తక్కువ సినిమాలు చేశాననే బాధ ఎంతమాత్రం లేదని కమ్ముల చెప్పాడు. తన సినిమాల విషయంలో ఎప్పుడూ లాభాల్లో వాటా కావాలని అడగలేదని.. తనకింత పారితోషకం ఇవ్వాలని మాత్రమే తీసుకున్నానని.. దాని వల్ల చాలా నష్టపోయానని.. అయినా ఏ విషయంలోనూ తనకు బాధ లేదని.. అన్నింటికంటే ప్రేక్షకుల ప్రేమ తనకు ముఖ్యమని శేఖర్ స్పష్టం చేశాడు.

## న్యాయవాదిపై దాడికి నిరసనగా

# కోర్టు విధులు బహిష్కరణ

**- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన న్యాయవాదులు**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ లోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ క్యాషియర్ నారాయణ ను కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేసి అమానుషంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ కోర్టు ప్రధాన ద్వారం ముందు న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధుల ను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ,నేరెళ్ల తిరుమల్ గౌడ్,పొత్తూరు అనిల్ కుమార్,గుడిసె సదానందం,కిషోర్ రావు, పురుషోత్తం,పెంట రాజు, వేముల సుధాకర్ రెడ్డి,పర్లపల్లి అంజయ్య,నక్క దివాకర్, పిల్లి మధు,జంగం అంజయ్య, మాదాసు దేవయ్య,కముటం అంజయ్య,గోగికారి శ్రీనివాస్, నాగుల సంపత్, గొంటి శంకర్, సుంకపాక నవీన్,నడిగట్ల హరికృష్ణ,భీమా మహేష్, కనికరపు శ్రీనివాస్,జెట్టి శేఖర్, మారుమొఖం అనిల్ కుమార్, పొత్తూరు మల్లేష్, గుజ్జె మనోహర్,వడ్లకొండ శ్రీకాంత్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ,బూర సరిత, తదితరులు ఉన్నారు.

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ : శివసేన రెడ్డి**

**- వేములవాడ పట్టణంలో మినీ స్టేడియం పరిశీలన**

**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ఎద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేములవాడ పట్టణంలో మినీ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు.మన ప్రాంతం అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీటవేస్తోందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, చందుర్తి మండలం మూడపల్లి వద్ద మినీ స్టేడియం నిర్మాణం, సిరిసిల్ల పట్టణంలో మినీ స్టేడియంలో నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడ%శీ% జరిగిందన్నారు. ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహారాలు ఉంటాయని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్,కబడ్డి పోటీలు జిల్లా పరిధిలో తన వంతు ప్రోత్సాహకం ఉంటుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాలకు పెద్ద పీట వేస్తున్నారని,అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు జీవితంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనే ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు గుర్తు చేశారు.

### శివ సేన రెడ్డి మాట్లాడుతూ

తన స్పోర్ట్స్ చైర్మన్ గా నియామకం అయిన నాటి నుండి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గం లో మినీ స్టేడియాల నిర్మాణం చేయవలసిందిగా కోరుతున్నారు.వారి కృషి ఫలితంగా నేడు వేములవాడ నియోజకవర్గం లో రెండు స్టేడియాలు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వం క్రీడాకారులను, క్రీడలను ఏమాత్రం పట్టించుకోలేదు. వారు 10 సంవత్సరాల కాలంలో క్రీడలకు రూ.400 కోట్లు కేటాయిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో 11 నెలల్లోనే రూ.800 కోట్లు కేటాయించడం జరిగినట్టు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచి గ్రామాల్లో నుంచి ఒలంపిక్ లో ఆడేలా మెరికల్ లాంటి క్రీడాకారులను తయారు చేయునున్నట్లు తెలిపారు. బనకచర్ల పాపం టిఆర్ఎస్ ప్రభుత్వానిదని, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోదావరి జలాల వాటా విషయంలో అడ్డుకున్నది తామే అన్నారు. అబద్దాలు ఆడడంలో హరీష్ రావు దిట్ట, ప్రజలను తికమక పెడుతున్నారు. వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని



డిమాండ్ చేశారు.. బనకచర్ల పాపం ఆనాటి కేసీఆర్ ధని 2016 సంవత్సరంలో కేంద్రంలో అపెక్స్ కమిటీ సమావేశానికి హాజరైంది కేసీఆర్,హరీష్ రావులే అన్నారు. మాజీ సిఎం కేసీఆర్ రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని అన్నది అబద్దమా అని ప్రశ్నించారు. కెసిఆర్, జగన్ మోహన్ రెడ్డి లు గోదావరి జిల్లాల విషయంపై నాలుగు సార్లు సమావేశం ఏర్పాటు చేసి గోదావరి జలాలను తీసుకెళ్లాలని చెప్పింది వాస్తవం కాదా ప్రశ్నించారు. 968 టీఎంసీలు గోదావరి జలాలు మా వాటా మాకు రావాలన్నారు.కాళేశ్వరం ను కేవలం ఏటీఎం గా వాడుకొని, కాలేశ్వరం తో వారి కుటుంబం బాగుపడిందని,కాళేశ్వరం ప్రాజెక్టు చుక్క నీరు వాడకుండానే దేశంలో అత్యధికంగా మన రాష్ట్రంలో మంచి పంటలు పండాయన్నారు.ఆంధ్రప్రదేశ్ కడుతున్న ప్రాజెక్ట్ లపై బీజేపీ వైఖరికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## బోనాల పండుగ కు హాజరై అమ్మవార్లను దర్శించుకున్న మనోహర్ రెడ్డి



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణ ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల పండగ మహోత్సవంలో భాగంగా శుక్రవారం "పెద్దమ్మ-దుర్గమ్మ" అమ్మవార్లను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి దర్శించుకున్నారు. వారి వెంట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బైరి సతీష్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మ శెట్టి విజయ్, నరాల శేఖర్, సిరిగిరి చందు, జోగిని శంకర్, కొండ కనుకయ్య, కందుల క్రాంతి, గుడిసె దేవరాజు, బాబు, పిల్లి శ్రీకాంత్, గొట్టం దేవయ్య, రాజు, సిద్దు, తదితరులు ఉన్నారు.

## రాజన్న సేవలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలసి తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వస్తి తో ఘనంగా స్వాగతం



పలికారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆలయ పర్యవేక్షకులు జి.శ్రీనివాస్ శర్మ శేష వస్త్రం కప్పి స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు.ఈ నేపథ్యంలో శివసేన రెడ్డి ని చైర్మన్ గెస్ట్ హౌస్ లో ఆలయ ఇంచార్జి ఈఓ రాధాభాయి మర్యాదపూర్వకంగా కలిశారు.

## రాజన్న అనుబంధ ఆలయాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన ఈఓ



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ అలయాలైన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి ,శ్రీ భీమేశ్వర స్వామి ,శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలను శుక్రవారం ఆలయ ఇంచార్జి ఈఓ రాధాభాయి క్షేత్రస్థాయిలో సందర్శించి ,బద్ది పోచమ్మ ఆలయంలో రాబోయే ఆషాడమాసం,పట్టణంలో వివిధ కుల సంఘాలు నిర్వహించబోయే బోనాల పండుగ గురించి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ప్రోటోకాల్ సహాయ కార్యనిర్వాహణ అధికారి గోవిందు,అశోక్ కుమార్, అనుబంధాలయాల పర్యవేక్షకులు వి వెంకట ప్రసాద్,తదితర ఆలయ సిబ్బంది ఉన్నారు.

## పెద్దమ్మ తల్లి సేవలో...

# రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మీ వీధిలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# యోగాతో యోగ్యులుగా మారండి

**అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు**

**తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ యోగ దినోత్యవము పురస్కరించుకొని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ మానవ శరీరంలో ఒక్కో అవయవానికి ఒక్కో ప్రత్యేక లక్షణం ఉంటుందంటూ దీనినే శరీర ధర్మం అంటారంటూ మన ప్రవర్తన అలవాట్లోతో ఆ ధర్మాన్ని అతిక్రమిస్తే ఆ అవయవానికి జబ్బు చేస్తుందన్నారు దాన్ని మళ్ళి సరైన దారిలో పెట్టడానికి యోగాసనాలు ఉపయోగపడతాయంటూ ప్రాణాయామం ధ్యానం వంటి సాధనలు మనసును ప్రశాంతంగా ఉంచుతూ ఆసనాలు శరీరంలోని రుగ్మతలను తగ్గిస్తూ కండరాలను బలపరుస్తాయన్నారు. కావున ప్రతి రోజు 30 నిముషాలు యోగాను అలవాటుగా మార్చుకుంటే ఆరోగ్య సమస్యలు చాల వరకు తగ్గి ఆరోగ్యవంతమైన యోగ్యులుగా ఉంటామన్నారు.

## పలువురిని పరామర్శించిన ఎంపి ఆర్ఆర్ఆర్





**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రైటర్ బస్తి గొల్లగూడెం కి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అఫ్జల్ పాషా కుటుంబాన్ని, ఎంపీ రామసాహాయం రఘురామ రెడ్డి శుక్రవారం పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అప్జల్ పాషా కుటుంబానికి తన ప్రఘాడ సానుభూతి వ్యక్తం చేశారు. అప్జల్ పాషా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. చిన్న వయసులో వారు మృతి చెందడం బాధాకరం అప్జల్ కుటుంబానికి తీరని లోటు అన్నారు. అదే విధంగా గౌతంపూర్లో గోల్కొండ శంకర్ మాతృమూర్తి గోల్కొండ లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటుగా మోజెస్, గురువులు, సురేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## మంథని నియోజకవర్గంలో ఎంపీ గడ్డం వంశీ సుడిగాలి పర్యటన...

**సుందిల్ల గుడిలో ప్రత్యేక పూజలు**

**అనంతరం పార్వతీ బ్యారేజ్ సందర్శన..**

**వెంకటస్వామి ఆశయాలను నెవవేరుస్త...**

**పేద ప్రజలకు అందుబాటులో ఉంటా**





**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మంథని నియోజకవర్గంలో పర్యటించారు. సుందిల్ల లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదంతో పార్వతీ బ్యారేజ్ ను సందర్శించారు. అక్కడ అధికారులను కలిసి బ్యారేజ్ కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ బ్యారేజీలను కట్టి ప్రజలకు అన్ని విధాల నష్టం జరిగే విధంగా కేసీఆర్ ప్రభుత్వం నిరుపయోగంగా ఉండే విధంగా ప్రభుత్వంపై అప్పుల భారాన్ని మోపినాడు.తన తాత వెంకటస్వామి ఆడుగు జాడల్లో నడుస్తూ.. ఆయన ఆశయాలను నెరవేరుస్తానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ...కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పేద ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు.ఏ ఆపద వచ్చిన ప్రతి ఇంటికి మీ ఇంటి బిడ్డల వంశీ కృష్ణ ఉన్నడని మీరు గుర్తు ఉంచుకోవాలని అన్నారు. సింగరేనీ సంస్థకు అండగా ఉంటూ.. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని కార్మికుల కుటుంబాల్లో నేను ఒక్కడిగా ఉంటాననీ కార్మికులు నన్ను ఎప్పుడూ మర్చిపోకూడదని కొనియాడారు. ఎవరు అందుబాటులో ఉన్న లేకున్న నేను మీకు అందుబాటులో ఉంటాననీ వంశీ అన్నారు.

## దివ్యాంగుడైన శ్రీనివాస్ కుఆర్థికంగా ఆసరాగా"నాట్స్ హోప్ ఫర్ స్పందన" కిరాణా షాప్ ఏర్పాటు

**- ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త: డాక్టర్ రఘు అరికపూడి**

**- యువజన అవార్డు గ్రహీత, రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షులు : గజ్జెల అశోక్**



**రామడుగు,(ప్రశ్న న్యూస్)**కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, పందికుంటపల్లి గ్రామానికి చెందినవీల్‌చైర్‌కు పరిమితమైనా, మనోధైర్యంతో ముందుకు సాగాలనే దివ్యాంగుడు శ్రీనివాస్ ప్రయత్నానికి తోడుగా నిలిచింది హెూప్4స్పందన సేవా సంస్థ. దివ్యాంగుడు చిమ్మల్ల శ్రీనివాస్‌కు స్వయం ఉపాధి కల్పించేందుకు నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వారి ఆర్థిక సహకారంతో కిరాణా షాపు ఏర్పాటు చేశారు.గత 11 ఏళ్ల క్రితం జరిగిన బైక్ ప్రమాదంతో వెన్నెముక దెబ్బతిని వీల్ చైర్ కే పరిమితం అయిన శ్రీనివాస్ కు భార్య,ఇద్దరు పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులతో జీవితం గడవడం కష్టమైంది. ఈ స్థితిని గమనించిన హెూప్4స్పందన వారు రూ.1.70 లక్షల వ్యయంతో ఆర్థిక సహాయం అందించి,రూ.1 లక్ష విలువైన షాపు,రూ.70 వేల విలువైన సరుకులు, రిఫ్రిజిరేటర్ అందించారు.శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త డా. రఘు ఆరికపూడి, యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఇది హెూప్4స్పందన సంస్థ ఏర్పాటు చేసిన 116వ షాపు కావడం గమనార్హం.సంస్థ ఉపాధ్యక్షులు కోట లక్ష్మీ నరసింహం పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో 1000 మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యమని డా. రఘు తెలిపారు.ఈ కార్యక్రమానికి సంస్థ సభ్యుడు మహేష్ దయ్యాల, శ్రీనివాస్ కుటుంబసభ్యులు, గ్రామస్థులు హాజరయ్యారు.

# సమస్యలు తీర్చలేని కార్పొరేటర్లు

- మౌలిక సదుపాయాల కల్పనలో కార్పొరేటర్లు విఫలం
- రోడ్ల మరమ్మత్తులు, తాగునీరు, డ్రైనేజ్, వీధి దీపాల సమస్యలు తీర్చలేని కార్పొరేటర్లు ఎందుకు..?
- అక్రమ సంపాదన పై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలను తీర్చడంలో లేకపాయె
- దశాబ్దాలు గడిచిన అభివృద్ధిలో అడుగుకు ముందుకు పోని సికింద్రాబాద్ నియోజకవర్గం
- ప్రతిపక్షాలలో నాయకులు డమ్మీగా ఉండడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజల ఆవేదన



**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

సికింద్రాబాద్ నియోజకవర్గం సమస్యలకు నిలయంగా మారింది. కార్పొరేటర్లు సమస్యలు తీర్చడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు కనీసం రోజువారి సమస్యలను కూడా తీర్చలేక సొంత అభివృద్ధికి పాటుపడుతూ ప్రజాప్రతినిధులమంటూ తిరగడం తప్ప వీళ్ళు చేసింది శూన్యం అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ, వీధి దీపాల వంటి కనీస సమస్యలపై అనేక ఫిర్యాదులు ఉండి ప్రజలు నిత్యం అవస్థల పాలవుతున్న ఒక్క కార్పొరేటర్ కూడా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేటర్లు కేవలం శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు హడావుడి చేయడం తప్ప సమస్యలపై ఎక్కడ స్పందించడం లేదని సమస్యలు తీర్చాలన్న చిత్తశుద్ధి ఒక్క కార్పొరేటర్ కు కూడా లేకపోవడంతో జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న 150 డివిజన్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. సికింద్రాబాద్ నియోజకవర్గం తో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలామంది మహిళా కార్పొరేటర్లు ఉండడంతో ఇక వాళ్ల షాడోలు రాజ్యమేలుతున్నారు. ప్రజలకు సేవ చేస్తారని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటే సేవా మాట దేవుడెరుగు అసలు ఒక్క సమస్యను తీర్చడం లేదని కమిషన్లు, అక్రమ నిర్మాణాల పైన అక్రమ సంపాదనపైన శ్రద్ధ తప్ప ప్రజల సమస్యలను తీర్చడం లేదని కేవలం ఎప్పుడూ ఒకప్పుడు పర్యవేక్షణ చేసి వాట్సాప్, ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్ లలో ఫోటోలు పెట్టుకోవడం తెలిసిన నాలుగు పత్రికలలో ప్రచురణ చేయించుకోవడం తప్ప సమస్యలు ఎక్కడ తీర్చడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అమ్మో కార్పొరేటర్ల..

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఉన్న కార్పొరేటర్లు పై ప్రజలు తీవ్ర అసహనంగా ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కెసిఆర్, కేటీఆర్ పుణ్యమా అని గెలిచి ఇప్పుడు వీళ్ళు చేస్తున్న నిర్లక్ష్యానికి బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు అంటేనే ప్రజలు భయపడేలా వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ గత పంది సంవత్సరాల పాలనలో గెలిచిన కార్పొరేటర్లు అక్రమాలు అవినీతికి పాల్పడుతూ కోట్లు గడించారన్న ఆరోపణలు ఉన్నాయి. వీళ్ళ అరాచకాల వల్లనే బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలయ్యిందన్న విమర్శలు లేకపోలేదు. గ్రేటర్లో పార్టీ గెలిచిన వ్యతిరేకత మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడింది. బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్లు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభివృద్ధిని పూర్తిగా మరిచారని ప్రజల సేవ చేయకుండానే షాడోలని అడ్డుపెట్టి అవినీతి అక్రమాలు చేస్తూ కోట్లు గడించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి డివిజన్లలో ఒక్కొక్క కార్పొరేటర్ అక్రమ నిర్మాణాలను అడ్డుపెట్టుకొని కోట్లు గడించారు. మరికొందరు కార్పొరేటర్లు ఏకంగా ప్రభుత్వ స్థలాలకే ఎసరు పెట్టారు కొన్ని డివిజన్లలో పార్కుల స్థలాలు సైతం మాయం చేసిన పుణ్యం ఈ కార్పొరేటర్లకే దక్కుతుందన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి కార్పొరేటర్లు ఉండడంవల్లనే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజల అవస్థలు చాలా ఉన్నాయని చిన్నపాటి సమస్యలను కూడా తీర్చలేని కార్పొరేటర్లను ప్రజలు ఏ పార్టీలో ఉన్న ఎన్నుకోకుండా ఓటమిపాలు చేయాలని నాయకులు సూచిస్తున్నారు.

### ఈ నాయకులుకు సమస్యలు పట్టవు..

సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రతిపక్షాల నాయకులు అంటేనే ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. అసలు ప్రతిపక్షం ఉందా.? ఉన్న ప్రజల కోసం పోరాడే ఒక్క నాయకుడు ఉన్నాడా.? ఇటు ఎంపీకి అటు ఎమ్మెల్యేలకు ఊడిగం చేస్తూ వాళ్ల పేరు చెప్పుకొని అక్రమ నిర్మాణాలు చేయించడం, కబ్జాలకు సహకరించడం, సొంత పనులు చేసుకోవడం ఇదే ఇక్కడ కొంతమంది నాయకులు అలవాటుగా మారింది.

ఇక అధికార పార్టీ నాయకులు మాత్రం చెట్టు చూపించే కాయలు అమ్ముకున్నట్లుగా మా ప్రభుత్వమంటూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు చేసుకోవడానికి నాయకులగా ఉన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన నాయకుడు లేడు. అందుకోసమే సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమెడ దూరంలో ఉంది. ఒక్క సరైన నాయకుడు కూడా సికింద్రాబాద్ నియోజకవర్గంలో లేకపోవడం ప్రజలు చేసుకున్న కర్మగా మారింది. ఇటు అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు అటు ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ప్రజలకు సేవ చేయాలని ఏమాత్రం చిత్తశుద్ధి లేకపోవడంతోనే సికింద్రాబాద్ అభివృద్ధికి నోచుకోలేదని భవిష్యత్తులో నోచుకుంటుందన్న ఆశ కూడా ఇక్కడ నివసించే ప్రజలకు లేదు.

# కేటీఆర్ అరెస్ట్ తప్పదా?

- ▶ ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఫార్ములా ఈ రేస్ కేసు
- ▶ కాంగ్రెస్ ది కక్ష సాధింపు చర్య అంటున్న బీఆర్ఎస్
- ▶ గులాబీ నేతల వాదనలు ఖండిస్తున్న కాంగ్రెస్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** లండన్‌కు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' తో కలిసి నాలుగేళ్ల పాటు హైదరాబాద్ లో ఫార్ములా ఈ రేస్ కండక్ట్ చేసేందుకు 2022 అక్టోబర్ లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రిమెంట్ కుదర్చుకుంది. ఎఫ్ఈఓ, గ్రీన్‌కో గ్రూప్‌లతో త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. అనంతరం.. మొదటి రేసు 2023 ఫిబ్రవరి 11న నిర్వహించారు. రెండోది 2024 ఫిబ్రవరి 10న జరగాల్సి ఉంది. కానీ 2023 డిసెంబర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండో రేసును రద్దు చేసింది. ఒప్పందంలోని షరతులను సర్కారు తప్పుబట్టింది. ఆర్థిక లావాదేవీల్లో అవినీతి జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీకి రూ. 55 కోట్లు చెల్లించారని ఈ రేస్ ను క్యాన్సిల్ చేసింది.ఈ వ్యవహారంలో అప్పటి అధికారులతో పాటు మాజీ మంత్రి కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసి విచారణకు పిలిచింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిగా కేటీఆర్ ఈ మొత్తాన్ని హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు జరపాలని ఆదేశించారని.. కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఇదంతా జరిగిందనే ఆరోపణలున్నాయి. ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నప్పుడు, ఎన్నికల సంఘం పర్మిషన్ తీసుకోలేదనేది మరో ఆరోపణ. ఇలా సరైన అనుమతులు తీసుకోకపోవడం వల్ల హెచ్.ఎం.డి.ఎకు రూ. 8.06 కోట్లు అదనపు పన్నుల భారం పడిందని ఏసీబీ పేర్కొంది. దీనికి సంబంధించి కేటీఆర్ ను ఇప్పటికే రెండు సార్లు ఎంక్వయిరీకి పిలిచింది.

### ఎవరికి లాభం? ఎవరికి నష్టం?:

బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని దీనివల్ల కేసీఆర్ ఫ్యామిలీ మెంబర్స్ భారీగా లబ్ధిపొందారని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులపై విచారణ జరుపుతామని ప్రతీ వేదికపైనా చెప్పారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు విద్యుత్ కొనుగోళ్ల విషయంలో కేసీఆర్ పైనా, హరీశ్ రావు పైనా విమర్శలు లేవనెత్తారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్ పై.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటీసులు జారీ చేసి విచారణ జరిపించింది. తాము చెప్పినట్లే పారదర్శకమైన పాలన అందిస్తున్నామని ప్రజలకు చెప్పుకునే అవకాశం దీనివల్ల ప్రభుత్వానికి కలుగుతోంది.ఇదిలా ఉంటే, ఫార్ములా ఈ రేస్ లో కేసు నమోదు కావడం బీఆర్ఎస్ శ్రేణులను నిరాశలోకి నెట్టింది. ఇది కేటీఆర్ ప్రతిష్ఠకు మచ్చగా మారవచ్చు. పార్టీ కార్యకర్తలు నైతికంగా దెబ్బతింటారు. ఇలాంటి కేసులు, న్యాయస్థానాల చుట్టూ తిరగడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, బలోపేతం చేసే వ్యూహాలకు పదునుపెట్టే సమయం ఉండదు. మానసిక ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది. ఇవన్నీ వ్యక్తిగతంగా కేటీఆర్ కు, పార్టీ భవిష్యత్తుకు నష్టం కలిగించే అంశాలు.ఈ కేసుల నుంచి బయటపడితే కేటీఆర్ కు పెద్ద ఎత్తున ప్రజల సానుభూతి లభిస్తుంది. అన్యాయంగా కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం జైలుకు పంపిందన్న ప్రజల సానుభూతి కేటీఆర్ పై వెల్లువెత్తుతుంది. కాంగ్రెస్ రాజకీయ వేధింపులు అని ఆ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేక భావజాలాన్ని రేకెత్తించవచ్చు. "జైలుకు వెళ్తా" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో ఆయన లీడర్‌షిప్‌ను బలోపేతం చేయవచ్చు. ఈ కేసులో తన తప్పు లేదని ఆధారాలు చూపి బయటపడితే ఆ పోరాట పటిమ వల్ల కేటీఆర్ పటిష్టమైన నాయకుడిగా మరింత ఎదిగే అవకాశం ఉంది. ఒకవేళ బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఇలాంటి కేసులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ కీలక నేతలు సైతం సిద్ధపడాల్సి వస్తుంది. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాలపై, పొలిటికల్ లీడర్స్ ఫ్యూచర్ పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# థాయ్‌లాండ్‌లో కొడుకు పెళ్లి

## - ఏసీబీ కస్టడీకి ఏఈ శ్రీధర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** భారీగా అక్రమాస్తులు కూడబెట్టి దొరికిపోయిన కాళేశ్వరం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ ను కస్టడీకి తీసుకొని విచారించనున్నారు ఏసీబీ అధికారులు. కరీంనగర్ లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ ఇళ్ళు, ఆఫీసుల్లో ఏసీబీ అధికారులు పది రోజుల క్రితం సోదాలు నిర్వహించి రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు. అంతేకాకుండా... తన కొడుకు పెళ్ళిని థాయిలాండ్‌లో గ్రాండ్ గా నిర్వహించారు. రిసెప్షన్, హల్దీ ఫంక్షన్స్ రిసార్ట్స్, వివిధ హోటల్స్ లో నిర్వహించారు. అధికారులు గుర్తించిన ఆస్తుల్లో తెల్లాపూర్ లోని విల్లా షేక్ పేట్ లో గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్, అమీర్‌పేట్‌లో కమర్షియల్ కాంప్లెక్స్, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్లు ఉన్నాయి. ఇవి కాకుండా, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లో 3 బిల్డింగ్స్, 16 ఎకరాల భూమి, 19 ఇళ్ల స్థలాలు, రెండు కార్లు, గోల్డ్ ఆర్నమెంట్స్, బ్యాంకు డిపాజిట్లను గుర్తించారు. ఏఈ శ్రీధర్‌ను కస్టడీకి తీసుకొని ప్రశ్నిస్తే మరిన్ని ఆస్తులు బయటపడతాయనీ, అవి ఎలా సంపాదించాడో దీని వెనుక ఉన్న పెద్ద మనుషులు ఎవరున్నారో బయటకు వస్తాయని ఏసీబీ భావిస్తోంది. అందుకే కోర్టులో ఐదు రోజులపాటు కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు అధికారులు. అందుకు ఏసీబీ కోర్టు పర్మిషన్ ఇచ్చింది. శుక్రవారం ఉదయం శ్రీధర్ ను కస్టడీకి తీసుకొని ఐదు రోజులు పాటు ప్రశ్నిస్తున్నారు ఏసీబీ అధికారులు. కాళేశ్వరంలో కీలక బాధ్యతలు నిర్వహించిన నూనె శ్రీధర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బదిలీ చేసినా ఏడాది పాటు అక్కడే ఉండి పనిచేశారు. అయితే కాళేశ్వరంలో పనిచేస్తున్న ఈఎంసీ అనిల్ ఆదేశాలతోనే శ్రీధర్ అక్కడే ఉండి పనిచేసినట్లు అధికారులు

## వారాంతపు సంతలతో

# సతమతమవుతున్న జనాలు

- వారాంతపు సంతల్లో కానరాని మౌలిక సదుపాయాలు
- రోడ్లపైనే దుకాణాలు రాకపోకలకు అంతరాయం
- సంతల ఏర్పాటుపై నిర్లక్ష్యం నీడలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నిత్యావసర వస్తువుల నుండి మొదలుకొని కూరగాయల కొనుగోళ్ళ వరకు నిర్వహించే వారాంతపు సంతలతో ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. కుటుంబ అవసరాల కోసం వారానికి సరిపడే సరుకులు కూరగాయలను ఒకేసారి తెచ్చుకునేందుకు వారాంతపు సంతలను వినియోగించు కుంటున్నారు. అయితే ఈ సంతల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సంతల్లో ఉపాధి హామీ పథకం నిధులతో వసతులు సమకూర్చుకోవాలని రాష్ట్రలకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసి ఏళ్లు గడుస్తున్నను అధికారుల నిర్లక్ష్యం, సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా ఎక్కడా అమలు కావడం లేదు. రాష్ట్రంలో జీహెచ్ఎంసీతో పాటు మున్సిఫల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలోని కాలనీలలో వారాంతపు సంతలను నిర్వహిస్తున్నారు. ఆయితే సంతల నిర్వాహణకు సరైన స్థలాలు లేకపోవడంతో ప్రధాన రహదారులు, వీధుల్లో విక్రయాలు చేస్తున్నారు. వందలాది మంది గుంపులుగా రోడ్లపై రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎమర్జెన్సీలలో అంబులెన్సు కూడా పోలేని పరిస్థితి ఏర్పడుతుంది. సంతల నిర్వాహణతో ఘణనీయంగా ఆదాయం సమకూర్చే సంతల్లో వారం వారం వినియోగదారులు పెరుగుతున్నా కనీస వసతులు మాత్రం కల్పించడం లేదు. ఏళ్లు గడుస్తున్నను పరిస్థితుల్లో మాత్రం మార్పురావడం లేదు. ముఖ్యంగా సంతల నిర్వహణకు స్థలాల ఎంపిక చేయకపోవడమే ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు

### లక్షల్లో ఆదాయం..

వారాంతపు సంతల ద్వారా మున్సిపాలిటీలకు లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతున్నను క్రయవిక్రయాల కోసం వచ్చే వ్యాపారులకుగానీ, ప్రజలకు గానీ కనీస సౌకర్యాలు కల్పిచడంలో ఆధికారులు పూర్తిగా విఫలమైన్నారు. అలాగే ప్రతివారం చిన్న అంగళ్లలోను ఐదువేల మందికిపైగా ప్రజలు నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు, రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు రైతులు అయితే అంగళ్లలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు కనీస ఏర్పాట్లు ఉండటం లేదు. ముఖ్యంగా సంబంధిత అధికారులు సంతల నిర్వాహణకై విశాలమైన స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా దీనిపై అధికారుల ఆలసత్వంతో రోడ్లపై సంతలు నిర్వహిస్తు రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగిస్తు ప్లాట్‌ఫామ్‌లపై తమ ఉత్పత్తుల దుకాణాలను ఏర్పాటు చేసుకొని రోడ్డు పక్కనే మట్టిలో కూరగాయలు, ఇతర వస్తువులు, దినుసులు కుప్పలుగా పోసి విక్రయించుకుంటున్నారు.

### వారాంతపు సంతల నిర్వహణపై అవగాహన కల్పంచాలి..

వారాంతపు సంతల్లో క్రయవిక్రయాలకు కోసం ప్రజలకు. రైతులకు సంతల నిర్వహణపై సరైన అవగాహణ కల్పించాల్సి ఉంది. సంత నిర్వాహణ పరిధిలో మౌలిక వసతుల కల్పన, ఇతర అత్యవసర పరిస్థితులపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహణ కల్పించాలి. అంతకంటే ముందు సంత నిర్వహించే స్థలం ఎంపిక చేసి సంబందిత అధికారులచే అనుమతులు పోందాల్సిఉంది. కాని వీటిపై అధికారులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. వారాంతపు సంతలు జరిగే ప్రాంతాలలో ఉపాధి నిధులు వినియోగించుకుని అవసరమైన నిర్మాణాలు, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏళ్లు గడుస్తున్నా కనీసం సంత జరిగే చోట ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం మరుగుదొడ్లతో పాటు రోడ్లపై నిర్వహిస్తున్న సంతలలో కనీసం తాగునీటి వసతి కూడా లేని పరిస్థితి ఉంది.

నీటి వసతితో పాటు ప్లాట్‌ఫారాలు, మూత్రశాలలు, మురుగుకాల్వలు, ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త వేసేందుకు స్థలం, పార్కింగ్ సౌకర్యాలు ఉండేలా స్థలాన్ని ఏర్పాటు చేసుకొని, తీర్మానం చేసి నిధులు మంజూరు చేసుకోవాల్సి ఉండగా అలాంటి చర్యలేవి చేపట్టడం లేదు. ఇప్పటికైన వారాంతపు సంతలతో ఉత్పన్నమవుచున్న అవాంతరాలను, ఆసౌకర్యాలపై దృష్టి సారించి రోడ్లపై నిర్వహిస్తున్న వారాంతపు సంతలపై సరైన విధంగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588